# ప్రజా తపన

prajathapana.com

*News that matters*

సంపుటి :01 సంచిక: 170 గురువారం 17 జులై 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-




సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానం గా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద



## ఎమ్మెల్సీ అనంత్ బాబు కేసులో తీర్పు రిజర్వ్

**విజయవాడ, ఆగస్టు 16**

ఎమ్మెల్సీ అనంత్ బాబు కేసులో తీర్పును రిజర్వ్ చేసింది ఆంధ్రప్రదేశ్ హైకోర్టు.. కేసును సీబీఐకి అప్పగించాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు హత్యకుగురైన డ్రైవర్ సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు.. ఈ కేసులో హైకోర్టులో ఇరు వర్గాల వాదనలు జరిగాయి.. ఎమ్మెల్సీ అనంత్ బాబు తరుపున ప్రభుత్వం తరుపు న్యాయవాది వాదనలు వినిపించారు.. అయితే, ప్రభుత్వం తరుపు న్యాయవాదికి పలు ప్రశ్నలను సంధించింది హైకోర్టు.. కేసులో ఎమ్మెల్సీ అనంత్ బాబు భార్యను ఎందుకు నిందితురాలిగా చేర్చలేదని ప్రశ్నించింది.. సీసీఫుటేజ్ లో ఉన్న వారిని ఎందుకు కేసులో చేర్చలేదు..? కేవలం అనంత్ బాబును మాత్రమే చేర్చడం ఏంటని ప్రశ్నించింది.మరోవైపు.. ఈ కేసులో పోలీసులు లోతుగా దర్యాప్తు చేయలేదంటూ పిటిషనర్ తరుపు న్యాయవాది జాడ శ్రావణ్ వాదనలు వినిపించారు..

02

## విద్యుత్తు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్

**జీతాలు పెంచుతూ, బీమా సదుపాయం కల్పిస్తూ సీఎం జగన్ నిర్ణయం**




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యుత్తు శాఖలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పింది. ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులకు జీతాలు పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. విద్యుత్ శాఖలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం 37 శాతం వేతనాలు పెంచింది. ఈ మేరకు విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయంతో విద్యుత్ శాఖలోని దాదాపు 27,000 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. దీంతోపాటు ఉద్యోగులకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని కాంట్రాక్ట్ ఏజెన్సీలను ప్రభుత్వం ఆదేశించింది. సీఎం జగన్ తీసుకున్న నిర్ణయంతో విద్యుత్ శాఖలోని పొరుగు సేవల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయంతో విద్యుత్ శాఖలోని దాదాపు 27,000 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది.

## ఐసీసీ తాజ్ మహల్ ముందు ఉన్న వరల్డ్ కప్ ఫోటో

**న్యూ ఢిల్లీ ఆగష్టు 16**

మరో 50 రోజుల్లో సొంత గడ్డపై వన్డే వరల్డ్ కప్ సమరం మొదలవ్వనుంది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 5న ప్రారంభం కానున్న వన్డే ప్రపంచకప్ కోసం అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రమోషన్స్ షురూ చేసింది. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రపంచకప్ క్యాంపెయిన్ ఫిల్మ్‌ను విడుదల చేసిన ఐసీసీ తాజ్ మహల్ ముందు ఉన్న వరల్డ్ కప్ ఫోటోను తాజాగా పంచుకుంది. ప్రస్తుతం ఈ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. తాజ్ మహల్ ముందు ఉన్న ఈ ట్రోఫీ చూడడానికి ఫ్యాన్స్

02




## కేసీఆర్ టూర్ వాయిదా

**హైదరాబాద్, ఆగస్టు 16**



మెదక్ జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటన వాయిదా పడింది. ఈ నెల 19న మెదక్ జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటించాల్సి ఉంది. అయితే ఆ రోజు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ఈ నెల 23కు వాయిదా పడిందని బీఆర్ఎస్ శ్రేణులు వెల్లడించారు. కాగా.. సూర్యాపేట పర్యటన మాత్రం యదావిధిగా కొనసాగుతుందని తెలిపారు. సూర్యపేటలో 20న, మెదక్ లో 23న పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ శ్రేణులు క్లారిటీ ఇచ్చారు.తెలంగాణ సీఎం కేసీఆర్ మెదక్, సూర్యాపేట జిల్లాల పర్యటన ఖరారు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో తాజా పరిస్థితులు, సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సీఎం కేసీఆర్ ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యారు. ఆగస్టు చివరి వారం నుంచి రెండు జిల్లాల్లో పర్యటించి బహిరంగ సభల్లో పాల్గొనబోతున్నారు. ఈ సమావేశాల ద్వారా ఎన్నికల వాతావరణాన్ని సృష్టించాలన్నది గులాబీ బాస్ ప్లాన్ గా తెలుస్తోంది. అసెంబ్లీ సమావేశాలకు ముందే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆగస్టు నెలాఖరులోగా మెదక్ జిల్లా, సూర్యాపేట జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు పలు బహిరంగ సభల్లో పాల్గొనేలా రోడ్ మ్యాప్ సిద్ధం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా.. తన బహిరంగ సభల ద్వారా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఎండగట్టాలన్నది సీఎం కేసీఆర్ వ్యూహంగా కనిపిస్తోంది. సూర్యాపేట జిల్లాలో..ముఖ్యమంత్రి కేసీఆర్ ఆగస్టు 20న సూర్యాపేట జిల్లాలో పర్యటించనున్నారు.ఈ పర్యటనలో భాగంగా సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు.. అనంతరం నూతనంగా నిర్మించిన ఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. ఇదే సందర్భంగా నూతనంగా నిర్మించిన మెడికల్ కళాశాలను సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల అనంతరం సూర్యాపేటలో నూతనంగా నిర్మించిన

02

## చంద్రుడి చుట్టూ తిరగనున్న చంద్రయాన్

**నెల్లూరు, ఆగస్టు 16**



ఇస్రో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 ప్రాజెక్టు మరో కీలక ఘట్టాన్ని పూర్తి చేసుకుంది. ఇవాళ మరోసారి ఫైరింగ్ ను విజయవంతంగా చేయడం ద్వారా.. చంద్రయాన్-3 ను 153 బై 163 కిలోమీటర్ల ఆర్బిట్ లోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. అంటే దీని ద్వారా చంద్రుడి చుట్టూ ప్రదక్షిణలు, అదే తిరగడం ఇక అయిపోయిందన్నమాట. సింపుల్ గా చెప్పాలంటే చంద్రయాన్-3 అనే సినిమాకు ఇవాళ పూర్తి చేసుకున్న ఘట్టం ప్రీ-క్లైమాక్స్. ఇక క్లైమాక్స్ కు రంగం సిద్ధమైంది. అదేంటంటే రేపు అంటే ఆగస్ట్ 17వ తేదీన ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్ మాడ్యూల్ వేరు పడుతుందన్నమాట. ఇలా సెపరేట్ అయిన ల్యాండర్ మాడ్యూల్ ఆగస్ట్ 23వ తేదీన స్మూత్ గా ల్యాండ్ అయితే చంద్రయాన్-3 మిషన్ విజయవంతం అయినట్టు అన్నమాట. ఇవాళ చంద్రయాన్-3 153 బై 163 కిలోమీటర్ల ఆర్బిట్ లోకి ప్రవేశపెట్టారు అని చెప్పుకున్నాం కదా. ఇక్కడి నుంచి 100 కిలోమీటర్ల దూరం చేరేదాకా ప్రయాణించి అక్కడి నుంచి ల్యాండర్ జంప్ చేస్తుందన్నమాట. మన ఇస్రో శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం ఆగస్ట్ 23వ తేదీన అది ల్యాండ్ అవుతుంది. అంటే సరిగ్గా ఇంకో వారమే ఉందన్నమాట.. ప్రయోగం విజయవంతమో కాదో తేలడానికి. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి జూలై 14న చంద్రయాన్-3ని విజయ వంతంగా ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఈ అంతరిక్ష నౌక ఆగస్టు 23న

02

## అలిపిరి రోడ్డులో ప్రతి వ్యక్తికి కర్ర

**తిరుమల, ఆగస్టు 16**





తిరుమల ఘాట్ రోడ్డు, నడక మార్గాల్లో వన్యమృగాల సంచారం తీవ్ర కలకలం రేపుతోంది. వన్యమృగాల దాడిలో చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. దీంతో అప్రమత్తమైన టీటీడీ, భవిష్యత్తులో కాలినడకన, ఘాట్ రోడ్డులో వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముఖ్య అటవీ శాఖ అధికారులతో సమావేశం అయ్యింది. అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గంలో చిన్న పిల్లల తల్లిదండ్రులను ఉదయం 5 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకే అనుమతించేలా చర్యలు చేపట్టింది. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత చిన్నపిల్లలను అనుమతించేది లేదని స్పష్టం చేసింది. రాత్రి పది గంటల వరకూ పెద్దలకు నడక మార్గంలో అనుమతి ఉంటుందని పేర్కొంది. నడక మార్గంలో వెళ్ళే ప్రతి భక్తుడికి ప్రయోగాత్మకంగా ఊతకర్రలు ఇచ్చింది. దీని ముఖ్య ఉద్దేశం తిరుమలకు భక్తులు నడక మార్గంలో వెళ్లే భక్తులకు అకస్మాత్తుగా జంతువులు కనిపిస్తే వాటి నుంచి రక్షణ పొందేందుకు ఈ ఊత కర్ర ఇస్తున్నారు. ప్రతి భక్తుని చేతిలో కర్రను ఇచ్చి జాగ్రత్తలు చెప్తున్నారు. అలిపిరి నుండి ఘాట్ రోడ్డులో వెళ్ళే ద్విచక్ర వాహనదారులకు ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం ఆరు వరకే అనుమతిస్తామని స్పష్టం చేసింది. భక్తుల భద్రత దృష్ట్యా ఎంత మందినైనా అటవీ శాఖా సిబ్బందిని నియమించింది.

02

# ఎమ్మెల్సీ అనంత్ బాబు కేసులో తీర్పు రిజర్వ్

(మొదటిపేజీ తరువాయి)

కేసును పోలీసులు నీరు గార్చే విధంగా వ్యవహరించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇక, ఎమ్మెల్సీ అనంత్ బాబు తరుపు సీనియర్ న్యాయవాది రఘు వాదనలు వినిపించేందుకు ప్రయత్నించారు.. రఘు వాదనలు వినేందుకు అంగీకరించలేదు న్యాయస్థానం.. ఇప్పటికే, ఈ కేసు వివరాలు సీల్డ్ కవర్ లో న్యాయస్థానానికి ప్రభుత్వం సమర్పించింది.. అయితే, ఇరువర్గాల వాదనలు విన్న హైకోర్టు.. తీర్పును రిజర్వ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

# ఐసీసీ తాజ్ మహల్ ముందు ఉన్న వరల్డ్ కప్ ఫోటో

(మొదటిపేజీ తరువాయి)

ఎగబడుతున్నారు.వరల్డ్ టూర్‌లో భాగంగా ప్రస్తుతం ప్రపంచకప్ ట్రోఫీ భారత్‌లో ఉంది. జూన్ 27న భారత్‌లో మొదలైన ఈ ట్రోఫీ టూర్ అనేక దేశాలు తిరిగి ఇప్పుడు ఆగ్రాకు చేరుకుంది. ఇక టోర్నమెంట్‌లో పాల్గొనే అన్ని దేశాల్లో ఈ ట్రోఫీ సందర్శన ఉంటుండగా.. భారత్ పర్యటన అనంతరం ఈ ట్రోఫీ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, వెస్టిండీస్, పాకిస్థాన్, ఫ్రాన్స్ సహా 18 దేశాలను చుట్టనుంది. సెప్టెంబర్ 4న తిరిగి మళ్ళీ భారత్‌కు రానుంది.భారత్‌లో జరుగనున్న మెగాటోర్నీకి అక్టోబర్ 5న తెరలేవనుండగా.. నవంబర్ 19న జరుగనున్న ఫైనల్‌తో వరల్డ్‌కప్ ముగియనుంది. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్, రన్నరప్ న్యూజిలాండ్ మధ్య జరుగనున్న తొలి పోరుకు ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ మైదానమైన అహ్మదాబాద్ వేదిక కానుంది.

# కేసీఆర్ టూర్ వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అనంతరం పార్టీ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ పాల్గొని ప్రసంగించనున్నారుమెదక్ జిల్లాలో..ఆగస్టు 23న మెదక్ జిల్లాలో కలెక్టర్ కార్యాలయం, జిల్లా పోలీసు (ఎస్పీ) కార్యాలయాన్ని ప్రారంభించే బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొంటారు. సమావేశానికి ముందు జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. ఇప్పటికే గులాబీ అధినేత పాల్గొనే సభ నిర్వహణలో మెదక్ జిల్లా నేతలు నిమగ్నమయ్యారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపడతున్నారు. కాగా, సీఎం పర్యటన ఏర్పాట్లపై మంత్రి హరీశ్ రావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలో అన్ని జిల్లాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో మెదక్ జిల్లా నుంచి భారీగా జనసమీకరణ చేస్తున్నారు.

# చంద్రుడి చుట్టూ తిరగనున్న చంద్రయాన్

(మొదటిపేజీ తరువాయి)

చంద్రుడి ఉపరితలంపై ల్యాండ్ అవనుంది. ఇప్పటికే అంతరిక్ష నౌక ఇటీవల చంద్రుడి దూరంలో మూడింట రెండు వంతుల దూరాన్ని కవర్ చేసింది. ఆగస్టు 23న చంద్రుడి ఉపరితలంపై చంద్రయాన్ ల్యాండింగ్ అయితే చరిత్ర సృష్టించినట్లే.చంద్రుడిపై చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్‌ను నిర్ధారించడానికి వివిధ ఎలక్ట్రానిక్, మెకానికల్ సబ్‌సిస్టమ్‌లతో కూడిన నావిగేషన్ సెన్సార్లు, ప్రొపల్షన్ సిస్టమ్‌లు ఉన్నాయి. వాటితో పాటుగా రోవర్‌ను సురక్షితంగా దించడానికి టూ-వే కమ్యూనికేషన్-సంబంధిత యాంటెనాలు, ఇతర ఆన్‌బోర్డ్ ఎలక్ట్రానిక్స్ యంత్రాంగాలు ఉన్నాయి. చంద్రయాన్ ప్రధాన లక్షాలు మొదటగా సురక్షిత ల్యాండింగ్ చేయడం, చంద్రుడిపై రోవర్‌ను దించడం, ఇన్-సిటు శాస్త్రీయ ప్రయోగాలు చేయడమే. చంద్రయాన్-3 అభివృద్ధి దశ జనవరి 2020లో ప్రారంభమైంది. 2021లో ప్రయోగించాల్సి ఉంది. అయితే కోవిడ్-19 మహమ్మారి కారణంగా మిషన్ కొంత కాలం వాయిదా పడుతూ వచ్చింది. 2019లో చంద్రయాన్-2 చంద్రుని ఉపరితలంపై సాఫ్ట్ ల్యాండింగ్ సమయంలో సవాళ్లను ఎదుర్కొన్న సవాళ్లు, ప్రధాన మిషన్ విఫలమడంతో శాస్త్రవేత్తలు చంద్రయాన-3కి శ్రీకారం చుట్టారు.చంద్రయాన్-1 మిషన్ సమయంలో ఉపగ్రహం చంద్రుని చుట్టూ 3400 కంటే ఎక్కువ సార్లు తిరిగింది. ఆగష్టు 29, 2009న అంతరిక్ష నౌకతో కమ్యూనికేషన్ కోల్పోవడంతో మిషన్ ముగిసింది. తాజాగా ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) చైర్మన్ సోమనాథ్ గత వారం చంద్రయాన్ 3 పురోగతిపై విశ్వాసం వ్యక్తం చేశారు. అన్ని వ్యవస్థలు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నాయని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం అంతా సవ్యంగా జరుగుతోందని, ఆగస్ట్ 23న చంద్రునిపై ల్యాండింగ్ చేసేందుకు వరకు వరుసగా కక్ష్య విన్యాసాలు చేస్తున్నామన్నారు.

# అలిపిరి రోడ్డులో ప్రతి వ్యక్తికి కర్ర

(మొదటిపేజీ తరువాయి)

భక్తులను గుంపులుగా నడక మార్గంలో పంపేందుకు నిర్ణయం తీసుకుంది.తగ్గిన భక్తుల రద్దీనిత్యం భక్తుల రద్దీతో కిటకిటలాడే అలిపిరి నడకమార్గం నిర్మానుష్యంగా కనిపించింది. తిరుమలలో వన్యప్రాణుల సంచారంతో అలిపిరి నడక మార్గం ఖాళీగా మారింది. నడక మార్గంలో చిరుతపులి (వన్య ప్రాణుల) సంచారంతో తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) అధికారులు అత్యవసరంగా సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. చిరుత లాంటి వన్య ప్రాణుల సంచారం అదుపులోకి వచ్చేంత వరకూ ప్రతి భక్తుడికి చేతికర్ర అందించేందుకు హైలెవెల్ కమిటీ నిర్ణయం తీసుకుంది. అలిపిరి నడకమార్గంలో ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 వరకే తల్లిదండ్రులతో పిల్లలకు అనుమతిని ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. 12 ఏళ్ల లోపు పిల్లలను మధ్యాహ్నం 2 తరువాత అనుమతించడం లేదని చెప్పారు. అయితే తిరుమలలో చిరుత సంచారంతో భక్తులు భయాందోళనకు గురవుతున్నారు. అలిపిరి నడకమార్గం, శ్రీవారి మెట్ల మార్గంలో నిర్మానుష్యంగా మారింది. నిత్యం గోవింద నామ స్మరణతో కిటకిటలాడే అలిపిరి నడకమార్గం, మెట్ల మార్గాల్లో భక్తుల తాకిడి చాలా తగ్గింది. వన్య ప్రాణుల సంచారం ఉన్నందున నడక మార్గంలో వెళ్లే భక్తులకు ఊతకర్ర ఇవ్వాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది. ఒకేసారి దాదాపు 100 మంది భక్తులకు గుంపులుగా నడకమార్గంలో పంపిస్తున్నారు. అదే విధంగా భక్తుల భద్రతకు నైపుణ్యం ఉన్న ఫారెస్ట్ సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకోనుంది.. నడక మార్గంలోని దుకాణదారుకు వ్యర్థాలను బయటకు వేయకుండా ఉంచితే చర్యలు తీసుకోవడంతో పాటుగా, అలిపిరి, గాలిగోపురం, 7వ మైలురాయి దగ్గర హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయనుందిఇప్పటికే అలిపిరి నడకమార్గంలో చిరుత సంచరిస్తుండగా.. బాలికపై దాడి చేసి చంపేసిన తరువాత బోనులు ఏర్పాటు చేయడంతో ఒక చిరుత చిక్కింది. అంతలోనే తిరుమలలో మరోసారి ఓ చిరుత కలకలం సృష్టించింది. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వద్ద చిరుత కనిపించడంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా వేద విశ్వవిద్యాలయంలో రాత్రి చిరుత సంచరించినట్లు గుర్తించారు. వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్ లో చిరుత కనిపించడంతో విద్యార్థులు పరుగులు తీశారు. టీటీడీ అధికారులకు, అటవీశాక అధికారులకు సమాచారం అందించారు.అంతా పుష్ప వల్లేతిరుమలలో చిన్నారి లక్షితను బలితీసుకున్న చిరుతలు.. ఇప్పటికీ అక్కడక్కడ సంచరిస్తూ కలకలం రేపుతూనే ఉన్నాయి.. తిరుమలకు వెళ్లే భక్తులతో పాటు స్థానికులకు కునుకు లేకుండా చేస్తున్నాయి..

# పురాతన కట్టడాలు, చారిత్రిక సంపద పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట

హైదరాబాద్, ఆగష్టు 16

చారిత్రక కట్టడాలు, చారిత్రక సంపద పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా పురావస్తు శాఖ రాష్ఠంలోని చారిత్రక ప్రాంతాలలో తవ్వకాలు జరిపి అరుదైన కళాఖండాలను, చారిత్రక సంపదను గుర్తించి వాటిని పరిరక్షిస్తోంది. గుర్తించిన ఈ సంపదను సంరక్షిండమే కాకుండా వాటిని దేశ విదేశాలలో ప్రదర్శించి తెలంగాణ చారిత్రక వైభవాన్ని ప్రపంచ దేశాలకు తెలియపరుస్తోంది. రాష్ట్రంలోని మ్యూజియంల నిర్వహణ పై కూడా ప్రత్యేక శ్రద్ధవహిస్తోంది. పురాతన మ్యూజియంల పునరుద్దరణ, నూతన మ్యూజియంల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించి అమలుచేస్తోంది. అందులో కొన్ని నిర్మాణదశలో ఉన్నాయి. మన చారిత్రక వైభవాలను వెలికితీసేందుకు కొత్తతవ్వకాలను జరిపేందుకు వ్యూహం రచించింది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని మూటకొండూరు మండలం చాడ గ్రామంలో చారిత్రక సంపద ఉన్నట్లు గుర్తించి అక్కడ తవ్వకాలు జరిపేందుకు కేంద్ర ప్రభుత్వ అనుమతిని కోరింది. అదేవిధంగా, సూర్యాపేట జిల్లాలోని ప్రముఖ బౌద్ధ కేంద్రం ఫణిగిరి లో కూడా తవ్వకాలను చేపట్టాలని నిర్ణయించింది.

కళాఖండాల ప్రదర్శన,మ్యూజియంల నిర్వహణ

రాష్ట్రంలోని ఫణిగిరి, ధూళికట్ట, నేలకొండపల్లి ప్రాంతాలలో లభించిన క్రీ.శ. 2వ శతాబ్దానికి చెందిన అరుదైన భౌద్ధ ఆరామాలకు చెందిన శిల్పకళా సంపదను న్యూయార్క్ పట్టణంలోని మెట్రోపాలిటన్ మ్యూజియంలో 2023 జూలై 17 నుండి నవంబర్ 23 వరకు ప్రదర్శించడం ద్వారా అక్కడి చరిత్రకారులను మరోసారి ఆకట్టుకోనుంది. ఈ శిల్పకళా సంపదనే కొరియాలోని నేషనల్ మ్యూజియంలో 2022 డిసెంబర్ 23 నుండి 14 ఏప్రిల్ 2024 వరకు నిర్వహించే ప్రదర్శనలో కూడా ఏర్పాటుచేయనుంది.

కరీంనగర్ జిల్లాలోని గాంధి సెంచరి మ్యూజియం పునర్వ్యవస్థీకరణకు 9.80 కోట్ల రూపాయలతో రూపొందించిన అంచనాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ బుద్ధవనం లోని బుద్దిష్ట్ మ్యూజియంలో చారిత్రక అంశాల వివరణ, కళాఖండాల ప్రదర్శనకు సిద్దంచేస్తోంది. వరంగల్ లో మరో మ్యూజియం ఆధునీకరించేందుకు 3కోట్ల రూపాయలకు పరిపాలనా ఆమోదముద్ర వేశారు.

చారిత్రక తవ్వకాలలో లభించిన సంపద

మహబూబ్ నగర్ జిల్లాలో పురావస్తు శాఖ జరిపిన తవ్వకాలలో 229 కాపర్ నాణాలు లభించాయి. వీటిని 2022మే 16న స్వాధీన పరచుకుని పరిశీలనలు జరిపింది. ఇవి 1626 నుండి 1672 మధ్యకాలానికి చెందిన కూలీకుతుబ్ షాకు, 1672 నుండి 1686 మధ్యకాలానికి చెందిన అబ్దుల్ హసన్ షా కు చెందినవిగా గుర్తించింది. ఈస్ట్ ఇండియా కంపెనీకి చెందిన 5 పెద్ద కాపర్ నాణాలు,



16వ శతాబ్ధానికి చెందినవిగా గుర్తించిన కుతుబ్ షాకి చెందిన 95 చిన్న కాపర్ నాణాలను వరంగల్ జిల్లా మట్వాడ పోలీస్ స్టేషన్ నుండి 2022 ఆగష్టు 19న స్వాధీన పరచుకుని భద్రపరిచింది. రంగారెడ్డిజిల్లా తలకొండపల్లి తహసిల్దార్ కార్యాలయం నుండి ఆధునిక కాలానికి చెందిన మరో కాపర్ నాణెమును 2022 డిసెంబర్ 29న స్వాధీనపరచుకుంది. జయశంకర్ భూపాలపల్లిలో 2023 జనవరి 6 వ తేదిన 17, 18 శతాబ్ధాలకు చెందిన మరికొంత అరుధైన చారిత్రక సంపదను పురావస్తు శాఖ స్వాధీన పరచుకుంది. అందులో 41 వెండి నాణాలు, 2 రాగి నాణాలు, 4 ఇత్తడి ఉంగరాలు, 1 ఇత్తడి రేకు ఉన్నాయి. ఇవి మొఘల్ కాలానికి చెందినవిగా గుర్తించారు.చారిత్రక ఆనావళ్ల పునర్ వ్యవస్థీకరణ

రాష్ఠంలోని చారిత్రక ప్రదేశాలలో మరిన్ని తవ్వకాలు జరిపి చారిత్రక ఆనవాళ్లను, చారిత్రక సంపదను వెలికితీసేందుకు, వాటిని పరిరక్షించేందుకు పురావస్తు శాఖ వివిధ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. అందులో భాగంగా గోల్కొండలోని కూలికుతుబ్ షా టూంబ్స్ లో, సంతోష్ నగర్ లోని పైగా టూంబ్స్ లో పరిశోధనలు నిర్వహించేందుకు ఆగాఖాన్ ట్రస్టుతో ఒప్పందం కుదుర్చుకుంది. స్వదేశి దర్శన్ గ్రాంట్ పథకం కింద రూ.2780 లక్షల నిధులు ఖర్చుచేస్తోంది. చార్మినార్ లోని మక్కామసీద్ లో పరిశోధనలు నిర్వహించి, ఆ ప్రాంతంలోని చారిత్రక కట్టడాలకు మరమ్మత్తులు చేసేందుకు, మౌళిక వసతులు కల్పించేందుకు రూ. 8 .48 కోట్లను వ్యయం చేస్తోంది. ఈ నిధులను మైనారిటీ వెల్ఫేర్ శాఖ అందిస్తోంది. ఖిలాషాపూర్ లో శిథిలమైన ఉత్తర దక్షిణ ప్రహరీ కోట గోడల పునరుద్ధరణను రూ. 1 . 26 కోట్లతో చేపట్టింది. యాదాద్రి భువనగిరి జిల్లాలలోని కొలనుపాక గ్రామంలో ఉన్న పురాతన ఆలయాల అభివృద్ధికి రూ.200 లక్షలను ఖర్చుచేసింది. ఈ నిధులను యాదాద్రి టూరిజం డెవల్మెంట్ అధారిటీకి విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర టూరిజం అభివృద్ధి శాఖ సహకారంతో రూ. 135 లక్షలను వెచ్చించి ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి వద్ద గల బుద్దిష్ట్ స్తూపం వద్ద యాత్రికుల సౌకర్యార్ధ్యం మౌళిక వసతులను కల్పించింది. ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ కోట అభివృద్ధి కోసం రూ.230 లక్షల అంచనా వ్యయంతో ప్రణాళిక రూపోందించింది. ములుగు జిల్లా రామప్ప దేవాలయ పరిసర ప్రాంతాల్లోని చిన్న చిన్న గుళ్ల అభివృద్ధి కోసం రూ. 1200 లక్షల అంచనా వ్యయంతో తయారుచేసిన ప్రాజెక్టు అగ్రిమెంట్ దశలో ఉంది. వనపర్తి జిల్లాలోని ఘణ్ పూర్ వద్ద గల జామియా మసీద్ అభివృద్ధి పనులు చివరిదశకు చేరుకున్నాయి. ఇందుకు గాను పురావస్తుశాఖ రూ. 85 లక్షలు ఖర్చు చేసింది. గన్ ఫౌండ్రి లోని పురావస్తుశాఖ డైరెక్టర్ కార్యాలయంలో ఫోటోగ్రఫీ విభాగానికి ఉపయోగిస్తున్న పురాతన భవన అభివృద్ధి కోసం రూ. 20 లక్షలు ఖర్చు చేసింది. జనగాం జిల్లా బమ్మెర పోతన గ్రామంలో గల బమ్మెర పోతన సమాధి పరిరక్షణ కోసం రూ. 75 లక్షలు ఖర్చు చేసింది. వరంగల్ జిల్లా మ్యూజియం అభివృద్ధి కోసం రూ. 50 లక్షలు ఖర్చుచేసింది.

హైదరాబాద్ సెయిలింగ్ క్లబ్ సమీపంలోని సైధాని మా బావి, టూంబ్స్ పరిరక్షణ, చార్మినార్ లోని బాద్- షాహి అశూర్ ఖానా అభివృద్ధి కోసం షేక్ పేట్ లోని షేక్ పేట్ సరాయి అభివృద్ధి కోసం ఆగాఖాన్ పౌండేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్ మెంట్ శాఖలతో పురావస్తు శాఖ రాత పూర్వకంగా ఒప్పందం కుదుర్చుకుంది

# తిరుపతి నగరంలోని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయండి

**- టీటీడీ చైర్మెన్ భూమన కరుణాకర రెడ్డి**

తిరుపతి

తిరుపతి నగరపాలక సంస్థలో టీటీడీ చేపడుతున్న అభివృద్ధి పనులపై టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి బుధవారం మునిసిపల్ కార్యాలయంలో టీటీడీ, మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులతో నగర మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత ఐఏఎస్, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ లతో కలిసి సమీక్షించారు. మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత ఐఏఎస్ నగరంలో జరుగుతున్న పనుల వివరాలను చైర్మెన్ భూమన దృష్టికి తీసుకురావడం జరిగింది. ఈ సందర్భంగా భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ టీటీడీ నిర్వహణలో ఉన్న 13 ప్రధాన రోడ్ల ఆధునీకరణ, డ్రైన్లు, ఫుట్ పాత్ ల నిర్మాణం, ఇతర మరమ్మతులు వంటి అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని టీటీడీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పనులకు గానూ 31 కోట్ల రూపాయలు మంజూరు కాగా, ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం వెంటనే అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. వీటికి టీటీడీ పాలక మండలి తొలి సమావేశంలో అనుమతులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా వారం రోజుల్లోపే యుద్ధ ప్రాతిపదికన హైమాస్ట్ లైట్స్ వేయాలని టీటీడీ అధికారులకు భూమన సూచనలు జారీ చేసారు. ఏఐఆర్ బైపాస్ రోడ్డులో వరదనీరు నిలవకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. చెర్లోపల్లి నుంచి చిత్తూరు, నాయుడుపేట 150 అడుగుల హైవే రోడ్డును అనుసంధానం చేస్తూ వకుళామాత ఆలయం వరకు ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. ఇందుకోసం ముఖ్యంగా భూసేకరణతో పాటు టెండర్ల ప్రక్రియ, ఇతర




సాంకేతిక అవరోధాలను అధిగమిచాలని సూచించారు. శ్రీనివాస కళ్యాణ మండపాలు వద్ద ఆర్చిని తొలగిస్తూ, పూర్తి స్థాయిలో ఆధునీకరించాలని, రాకపోకలకు వీలుగా రెండు పెద్ద గేట్లను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా శ్రీనివాస కల్యాణ మండపాల వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, ఇక్కడి డ్రైన్లనూ ఆధునీకరించి, వరద నీరు పొంగకుండా చర్యలు చేపట్టాలని టీటీడీ ఇంజనీరింగ్ అధికారులను భూమన ఆదేశించారు. గోవిందరాజ స్వామి కళాశాల చుట్టూ డ్రైన్లు అస్థవ్యస్థంగా కాకుండా, డ్రైన్ వ్యవస్థను మెరుగు పరచాలన్నారు. ఇందులో భాగంగా టీటీడీ, మునిసిపల్ ఇంజనీర్లు సంయుక్తంగా పరిశీలన చేసి కార్యాచరణ రూపొందించాలన్నారు. కొత్తగా చేపట్టనున్న కేటీ రోడ్ ఆధునీకరణ పనుల విషయంలో ముందస్తుగా డెక్ లను ఏర్పాటు చేస్తామని భూమన దృష్టికి టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు తీసుకొచ్చారు. దీనివల్ల వేసిన రోడ్లను, ఫుట్ పాత్ లను పదేపదే పగులగొట్టడం, గుంతలు తీయడం వంటి అవసరాలు తలెత్తకుండా ఉంటాయని టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలోనే శ్రీనివాసం సముదాయం వద్ద ఉన్న అండర్ పాస్ ను శ్రీనివాసం సముదాయం వరకూ పొడిగించాలని, అదేవిధంగా శ్రీనివాసం సముదాయానికి దగ్గరలో శ్రీనివాససేతు వారధి ల్యాండింగ్ ఉన్న కారణంగా ప్రమాదాల నివారణ చర్యల కింద శ్రీనివాసం సముదాయం ప్రధాన గేట్ ను మార్పు చేస్తూ, మరొక కొత్త గేట్ ను ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం 4.5 కోట్ల రూపాయలు మంజూరైనట్టు భూమన చెప్పారు. రామానుజం సర్కిల్ వద్ద ఇప్పుడున్న చోటే భారీ సైజుతో రామానుజం వారి మరో కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానముల చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి ఆదేశించారు. ఈ సమావేసంలో తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత ఐఏఎస్, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, టీటీడీ సాంకేతిక సలహాదారు రామచంద్రా రెడ్డి, సీఈ నాగేశ్వర రావు, మునిసిపల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, ఏసి సునీత, డిసి చంధ్రమౌళీశ్వర్ రెడ్డి, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల నడక మార్గంలో ఆంక్షలు

**తిరుమల, ఆగస్టు 16 :**

శేషాచలంలోని చిరుతలు నడక మార్గం వైపు వస్తుండటంతో వెంకన్న భక్తుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. నడక మార్గంల్లో చిరుతలు, క్రూర మృగాల కదలికలు భక్తుల్ని మరింత కలవర పెడుతుంది. దాంతో టీటీడీ అప్రమత్తమైంది. నడక మార్గంలో సెక్యూరిటీని పెంచడంతోపాటు పలు కీలక నిర్ణయాలను అమలు చేయాలని నిర్ణయించింది. అటివీశాఖ నివేదిక ఆధారంగా నడకదారిలో సెక్యూరిటీకి ప్రియారిటీ ఇస్తోంది. ఈ క్రమంలోనే సరికొత్త ఆలోచనలను తెర మీదికి తెచ్చింది. అదివో అల్లదివో.. అంటూ తిరుమల శ్రీవారిని కీర్తిస్తూ కొండెక్కుతున్న భక్తులకు ఇప్పుడు నడక మార్గంలో పలు ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. ఆపదమొక్కుల స్వామి శ్రీ వెంకటేశ్వరుడి మొక్కులు తీర్చుకునేందుకు అలిపిరి నడక మార్గం, శ్రీవారి మెట్టు మార్గంలో కొండెక్కే భక్తులు భద్రతపరంగా టిటిడి తీసుకున్న నిర్ణయాలను ఇకపై తూచా తప్పక పాటించాల్సి ఉంది. చిరుతల వరుస దాడులు, క్రూర మృగాల సంచారంతో అప్రమత్తమైన టిటిడి భక్తులకు భద్రతపై భరోసా ఇచ్చేందుకు కీలక నిర్ణయాలు తీసుకుంది. అటివిశాఖ వైల్డ్ లైఫ్ అడిషనల్ పీసీసీఎఫ్ శాంతిప్రియా పాండే నేతృత్వంలోని ఎక్స్‌పర్ట్స్ కమిటీ ఇచ్చిన నివేదికపై టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమావేశం చర్చించింది. ఈ సిఫారసులను పరిశీలించిన టిటిడి పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. భక్తుల భద్రత విషయంలో రాజీ ప్రసక్తే లేదన్న నిర్ణయానికి వచ్చింది. ఖర్చు ఎంతైనా భరించేందుకు టీటీడీ సిద్దమైంది. భక్తుల సేఫ్టీకి ప్రియాలిటీ ఇస్తూ తీసుకున్న నిర్ణయాలను ప్రకటించింది. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే 12 ఏళ్ల లోపు వయస్సు ఉన్న పిల్లలను నడక మార్గంలో అనుమతించాలని నిర్ణయించింది. రాత్రి 10 గంటల దాకా పెద్దలకు నడక మార్గంలో అనుమతి ఉంటుందని పేర్కొంది. అలిపిరి నుంచి తిరుమల వరకు ఉన్న 7.6 కిలోమీటర్ల నడక మార్గంలో 3550 మెట్లు ఉండగా వెంకన్న సన్నిధికి చేరుకునేందుకు భక్తుడికి 4 గంటలకు పైగానే సమయం పడుతుంది. శ్రీవారి మెట్టు మార్గం నుంచి తిరుమల కొండకు చేరెందుకు 2.1 కిలోమీటర్లు ఉండగా 2,388 మెట్లు ఎక్కాల్సి ఉంది. ఇప్పుడు ఈ రెండు మార్గాల్లో వెళ్లే భక్తులకు క్రూర మృగాల భయం హడలెత్తిస్తోంది. దీంతో ఎన్నో ఆలోచనలకు నిర్ణయాలకు తెర తీసిన టిటిడి సరికొత్త ఆలోచనలతో ముందుకు వెళ్తోంది. కాలిబాటన వెళ్లే ప్రతి ఒక్కరికీ ఊతకర్రను ఇవ్వాలన్న కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టింది. ప్రతి భక్తుడి చేతిలో ఉండే ఊతకర్ర ఎంతగానో ఉపయోగ పడుతుందని భావిస్తోంది. ఈ మేరకు ఊత కర్రలను కూడా సిద్ధం చేస్తుంది. కొనుగోలు చేసి అందుబాటులోకి తీసుకొస్తుంది. ఇక ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఫూట్ రోడ్డులో బైక్ లకు అనుమతించనున్న టిటిడి.. ఇప్పటికే ఈ నిబంధన కచ్చితంగా అమలు చేస్తుంది. భక్తులు గుంపులు గుంపులుగానే నడక మార్గాల్లో వెళ్ళాలని కోరుతోంది. నడక మార్గంలో భక్తులు జంతువులకు తినుబండారాలు ఇవ్వడం నిషేదించిన టిటిడి.. అలాంటి అమ్మకాలు జరిపే వారిపై చర్యలు తీసుకుంటామని కూడా వార్నింగ్ ఇస్తోంది. అలిపిరి నుంచి తిరుమల వరకు 500 కెమెరా ట్రాప్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్న టిటిడి.. నడక మార్గంలో ఇరువైపుల ఫోకస్ లైట్స్ ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి వచ్చింది. నడక మార్గం ఇరువైపులా వ్యూ లైన్స్ ఏర్పాటుచేసి, పొదలు లేకుండా చేస్తుంది. పొదల్లో పొంచి ఉన్న చిరుతలు బయటికి వస్తే దూరం నుంచే కనిపించే విధంగా ఈ నిర్ణయం తీసుకుంది. మరోవైపు రోప్ పార్టీలతో బందోబస్తు, చిరుతలు, క్రూర మృగాలు అటాక్ చేసే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో వెటర్నరీ టీమ్స్ ఏర్పాటు చేయనుంది. ఇందుకయ్యే ఆర్థిక వనరులన్నీ టిటిడి సమకూర్చనుండగా నిర్వహణ బాధ్యత అటవీ శాఖ చేపట్టనుంది. ఇక నడకమార్గంలో ఫెన్సింగ్ పై కేంద్ర అధ్యయన కమిటీ సలహా మేరకు నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెపుతున్న టిటిడి.. అలిపిరి, గాలి గోపురం, 7 వ మైలు ప్రాంతాల్లో ప్రమాదాలపై భక్తులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోనుంది.

# ముందస్తు సర్వేలతో పార్టీలు

**విజయవాడ, ఆగస్టు 16 :**

ముందస్తు సర్వే ఫలితాలపై అత్యుత్సాహం ప్రదర్శించకూడదని ఏపీలో అధికార పార్టీ భావిస్తోంది. ఇటీవల కాలంలో వరుస సర్వేల్లో సానుకూల ఫలితాల రావడాన్ని ఎక్కువ హైలైట్ చేయకూడదని వైసీపీ అధిష్టానం భావిస్తోంది. అధికార వైఎస్సార్సీపీకి అనుకూలంగా వచ్చే ఎన్నికల ఫలితాలపై అప్రమత్తంగా ఉండాలని ఆ పార్టీ భావిస్తోంది. ఇటీవల కొంత కాలంగా రకరకాల సంస్థలు వైసీపీ విజయావకాశాలపై అనుకూలంగా ఫలితాలను వెల్లడిస్తున్నాయి. ఈ ఫలితాలను వైసీపీ సోషల్ మీడియా బృందాలు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాయి. కర్ణాటక ఎన్నికల ఫలితాలతో పోల్చి అయా సర్వే సంస్థలు వెలువరించిన నివేదికలు నిజమేనని వైసీపీ సోషల్ మీడియా బృందాలు కాంపెయిన్ చేస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం ఏపీలో వైసీపీ గెలుపు ఖాయం అంటూ ఓ సంస్థ సర్వే ఫలితాలను ప్రకటించింది. 135 స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు గెలుస్తారంటూ ఫలితాలను ప్రకటించారు. గతంలో కర్ణాటక ఎన్నికల ఫలితాల్లో ఆ సంస్థ వెలువరించిన ఫలితాలకు అనుగుణంగానే ఎన్నికల్లో రిజల్ట్ రావడంతో చూడ్డానికి విశ్వసనీయంగానే ఉందని వైసీపీ వర్గాలు భావించాయి. దీంతో పెద్ద ఎత్తున ఆ సర్వే ఫలితాలను సోషల్ మీడియాలో ట్రోల్ చేశాయి. ఇలా ఒక సర్వే ఫలితాలు వెలువడిన కొద్ది రోజులకే ఇంకో సంస్థకు చెందిన సర్వే ఫలితాలు వెలువడ్డాయి. అందులో కూడా వైసీపీకి అనుకూలంగా కాస్త అటుఇటుగా ఫలితాలను ప్రకటించారు. ఒకే సమయంలో వేర్వేరు సంస్థలు తమ పార్టీకి అనుకూలంగా ముందస్తు ఫలితాల సరళిని ప్రకటించడంతో వైసీపీ నేతల సంతోషానికి అడ్డు లేకుండా పోయింది. 2019 ఎన్నికల్లో 151 స్థానాల్లో రికార్డు స్థాయి విజయాన్ని సాధించింది. వచ్చే ఎన్నికల్లో వై నాట్ 175 అంటూ ముఖ్యమంత్రి పార్టీ క్యాడర్‌ను ఉత్సాహ పరుస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని స్థానాల్లోను తమ పార్టీ అభ్యర్థులే గెలుస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో సర్వే ఫలితాలు ముఖ్యమంత్రి చెబుతున్నట్లు 175కు, గత ఎన్నికల్లో గెలిచిన 151 స్థానాలకు దగ్గరగా లేకపోయినా సర్దుకుపోతున్నారు. మళ్లీ తమ పార్టీకే గెలుపు అనే ఉత్సాహం మీద ఉన్న ఆ పార్టీ నేతలకు ఈ సర్వే ఫలితాలు తమను ట్రాప్‌లో?కి దింపే ప్రయత్నాలు అని అనుమానం వచ్చినట్టు చెబుతున్నారు. ప్రస్తుతం ఏపీలో టీడీపీ, జనసేన మధ్య ఎలాంటి అవగాహన కుదరలేదు. ఎన్నికల నాటికి ప్రభుత్వ వ్యతిరేక ఓటు బ్యాంకు చీలనివ్వకూడదని మాత్రం పవన్ కళ్యాణ్ పదేపదే చెబుతున్నారు. ప్రస్తుతం వెలువడుతున్న సర్వే ఫలితాలన్ని పార్టీలు వేర్వేరుగా పోటీ చేసినప్పుడు వచ్చే ఫలితాలని అయా సంస్థలు చెబుతున్నాయి. ఎన్నికలు దగ్గరపడే సమయానికి పార్టీల మధ్య రాజకీయ అవగాహన, ఒప్పందం కుదిరి ఫలితాలు తారుమారైనట్లు సర్వే ఫలితాల్లో చూపిస్తారనే సందేహం తలెత్తింది. ప్రస్తుతం తమకు అనుకూలంగా చూపించే సర్వే ఫలితాల్లో భవిష్యత్తులో రాజకీయ సమీకరణల దృష్ట్యా మారినట్టు చూపిస్తారనే సందేహం తలెత్తింది. దీంతో స్పష్టతలేని సర్వేలను భుజాన మోయకూడదని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ సర్వేలతో సంబంధం లేకుండానే కాంపెయిన్ నిర్వహించాలని నిర్ణయానికి ఆ పార్టీ వర్గాలు వచ్చాయని చెబుతున్నారు.

# 19 వరకు పవన్ యాత్ర

**విశాఖపట్టణం, ఆగస్టు 16:**

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారాహి విజయ యాత్ర మూడో విడత కొనసాగుతుంది. ఈ నెల 10వ తేదీన విశాఖపట్నంలో ప్రారంభమైన వారాహి విజయయాత్ర ఐదు రోజులపాటు కొనసాగింది. విశాఖతో పాటు గాజువాకలో వారాహి యాత్ర నిర్వహించిన పవన్.. ఈ రెండు ప్రాంతాల్లో జరిగిన బహిరంగ సభల్లో ప్రసంగించారు. ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసారు. విశాఖపట్నంలో రుషికొండ పరిశీలనకు వెళ్లి సర్కారుపై తీవ్ర విమర్శలు చేసారు పవన్ కళ్యాణ్. గత రెండు టూర్ల కంటే మూడో విడత యాత్రలో విమర్శల డోస్ పెంచారు. విశాఖలో భూకబ్జాలు పెరిగిపోయాయని.. స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీతో పాటు సీఎం జగన్ పై అనేక ఆరోపణలు గుప్పించారు. పవన్ వ్యాఖ్యలపై అధికార పార్టీ కూడా అంతే గట్టిగా స్పందించింది. ఐదు రోజులపాటు జరిగిన యాత్ర మొత్తం టెన్షన్ వాతావరణంలో సాగింది. జూన్ లో వారాహి యాత్ర ప్రారంభించిన తర్వాత ఉమ్మడి గోదావరి జిల్లాల్లో మొదటి రెండు యాత్రలు జరిగాయి. అప్పటి నుంచి పవన్ కేవలం వారాహి ద్వారా మాత్రమే రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. అయితే, మంగళగిరి స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న పవన్.. తిరిగి విశాఖలో పర్యటించనున్నారు. ఈసారి వారాహి లేకుండా పర్యటన జరగనుంది. గాజువాక సభ తర్వాత వారాహి వాహనాన్ని మంగళగిరి పార్టీ ఆఫీస్ కు తరలించారు. వారాహి విజయ యాత్ర మూడో విడత విశాఖలో ప్రారంభించిన పవన్ కళ్యాణ్ ఆగస్ట్ 15న అమరావతి వెళ్లారు. ముందుగా నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం ఆగస్ట్ 19 వ తేదీ వరకూ విశాఖలో పవన్ పర్యటన కొనసాగనుంది. అయితే మధ్యలో ఒకరోజు బ్రేక్ తర్వాత తిరిగి పవన్ తన పర్యటన కొనసాగించనున్నారు. విశాఖపట్నం పర్యటనలో మిగిలిన రోజులు వారాహి వాహనం లేకుండానే పవన్ పర్యటన కొనసాగనుంది. షెడ్యూల్ ప్రకారం విశాఖపట్నం జిల్లాలో రెండు చోట్ల మాత్రమే బహిరంగ సభలున్నాయి. ఆ రెండు సభలు ఇప్పటికే పూర్తయ్యాయి. మిగిలిన రోజుల్లో షెడ్యూల్ ప్రకారం ఎలాంటి బహిరంగ సభలు లేవు. మిగిలిన నాలుగు రోజుల పర్యటనలో కేవలం క్షేత్రస్థాయి పర్యటనలు, పార్టీ సమావేశాలు ఉన్నాయి. రుషి కొండ పర్యటనకు వెళ్లిన విధంగానే వారాహి బదులు ఇతర కార్లలో క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తారని పార్టీవర్గాలు చెబుతున్నాయి. అంతే తప్ప వేరే ఇతర కారణాలు లేవంటున్నారు పార్టీ నాయకులు. అవసరం ఉన్నప్పుడే వారాహి వాహనాన్ని బయటకు తీస్తామని తెలిపారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం పవన్ కల్యాణ్ యాత్ర ఆగస్టు 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జరగనుంది. ఈ యాత్రలో భాగంగా క్షేత్ర స్థాయి పరిశీలనలు, విశాఖలో చోటు చేసుకొంటున్న భూకబ్జాలకు సంబంధించిన పరిశీలనలు ఉంటాయని ముందుగా నిర్ణయించారు. ఇప్పటికే బహిరంగ సభలు ముగియడంతో 19వ తేదీ వరకూ వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఆగస్టు 17వ తేదీన విశాఖలో జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 18 లేదా 19వ తేదీన స్థానిక నేతలు, ముఖ్య నాయకులతో పార్టీ సమావేశంలో పాల్గొంటారు. అవసరమైతే ఒకటి రెండు రోజులు పర్యటన పొడిగించే అవకాశం ఉందని జనసేన పార్టీ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఉత్తరాంధ్రపై దృష్టి పెట్టిన పవన్ కల్యాణ్ మరోసారి విశాఖ పర్యటన ద్వారా పార్టీ బలోపేతానికి నేతలకు దిశానిర్దేశం చేయనున్నట్లు తెలుస్తోంది

# వాలంటీర్లకు రక్షణగా వైసీపీ అడుగులు

**నెల్లూరు, ఆగస్టు 16:**

వాలంటీర్ల వ్యవహారంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఫుల్ అలర్ట్‌గా వ్యవహరిస్తోంది. వచ్చే ఎన్నికల్లో వాలంటీర్ల పాత్ర కీలకం కానున్న వేళ పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ నడస్తోంది.. వాలంటీర్ల వ్యవహారంలో అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లో వెనక్కి తగ్గే ప్రసక్త లేదని స్పష్టం చేస్తోంది. అధికారుల కన్నా ముందు వాలంటీర్లకే అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ప్రభుత్వంలోని పెద్దలు, పార్టీలోని పెద్దలతో సహా వాలంటీర్లపై శ్రద్ద పెడుతున్నారు. వారిపై వచ్చే విమర్శలకు ఎప్పటికప్పుడు చెక్ పెట్టటంతోపాటు, వాటిని తిప్పికొట్టేందుకు పకడ్బందీగా వ్యవహరిస్తున్నారు. దీనిపై పార్టీ క్యాడర్‌కు కూడా ఆదేశాలు ఇస్తున్నారు. వాలంటీర్లకు అండగా నిలబడేందుకు పార్టీ నుంచి సంకేతాలు అందుతున్నాయి. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ వాలంటీర్ల పైనే అంటూ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వాలంటీర్లతో ఎన్నికల విధులు నిర్వహించకూడదని ఇప్పటికే ఎన్నికల సంఘం నుంచి ప్రత్యేకంగా ఆదేశాలు వచ్చాయి. అయితే వాటిని క్షేత్ర స్థాయిలో పట్టించుకోవటం లేదని విమర్శలు ఉన్నాయి. వాలంటీర్లతోనే ఓటర్ల జాబితా సవరణలు చేయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నా లెక్క చేయటం లేదు. ఎన్నికల సమయానికి రాష్ట్రంలో ఉన్న వాలంటీర్లతో రాజీనామా చేయించి, వారిని పార్టీకి అవసరసమైన మార్గాల్లో వినియోగించుకునేందుకు ప్లాన్ జరుగుతుందని చర్చ జరుగుతుంది. ఎన్నికల సమయం నాటికి పోలింగ్ బూత్‌ల వారీగా, వాలంటీర్ల ద్వారానే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కీలకంగా చక్రం తిప్పే అవకాశాలు కనిపిస్తున్నాయని టాక్. ప్రతి ఇంటికి వాలంటీర్ కీలకం అవుతున్న వేళ పోలింగ్ బూత్‌లో వారినే నియమించాలని చూస్తున్నారు. వారితో ప్రజలకు ఉన్న పరిచయాలను అక్కడ పనికి వస్తుందని పార్టీ విజయంపై అది ప్రభావం చూపుతుందని అంటున్నారు. ఎన్నికల నాటికి వాలంటీర్లు రాజీనామా చేసి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనబోతున్నారట. వారికి పెద్ద ఎత్తున లబ్ధి చేకూర్చే కార్యక్రమాలపై కూడా ఫోకస్ పెడుతున్నారు. వాలంటీర్లు రాజీనామా చేసిన తరువాత వారికి పార్టీ తరఫున నెలకు 12వేల రూపాయలు జీతాన్ని ఫిక్స్ చేయించాలని భావిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఎన్నికల తరువాత మరోసారి వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే, వాలంటీర్లకు ఫుల్ పవర్స్ ఇవ్వబోతున్నారని టాక్. అన్ని విధాలుగా అండగా ఉంటామనే భరోసా కూడా కల్పించేలా చేస్తున్నారు. అన్ని అనుకున్నట్లు జరిగితే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ టార్గెట్ పెట్టుకున్నట్లుగా 175 నియోజకవర్గాల్లో అత్యధిక సీట్లను గెల్చుకోవటం ఖాయమంటున్నారు. ఇందులో వాలంటీర్ సేవలు కీలకం కాబోతున్నట్లు సంకేతాలు పంపుతున్నారు. దీంతో వాలంటీర్లకు ఇకపై మరింత డిమాండ్ ఏర్పడే అవకాశాలు లేకపోలేదని పార్టీ వర్గాలు అంటున్నాయి.

# బాలినేని ఆగ్రహం ఎందుకో...

**ఒంగోలు, ఆగస్టు 16:**



బ్రో' సినిమా విడుదల తర్వాత ఎందుకో పోకిరి సినిమాలో 'గిల్లితే గిల్లిచ్చుకోవాలి'.. అనే డైలాగ్ ఏపీ రాజకీయాల్లో బాగా పాపులర్ అయింది. తనను దొంగచాటుగా గిల్లాలని మంత్రి అంబటి, గిల్లితే ఎవరూ గిల్లిచ్చుకోరు, తిరిగి గిల్లుతారంటూ మాజీ మంత్రి పేర్ని నాని సెటైర్లు పేల్చారు. ఇప్పుడు వైసీపీకే చెందిన మరో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులరెడ్డి కూడా పరోక్షంగా అదే డైలాగ్ కొట్టారు. ఇంతకుముందు తనపై కొందరు కుట్రలు చేశారు, తనపై తప్పుడు ప్రచారం చేశారంటూ.. వైవీ సుబ్బారెడ్డిని టార్గెట్ చేసిన బాలినేని, మరోసారి స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన టాపిక్ తెరపైకి తెచ్చారు. ఒంగోలు ఎంపీ, ఎమ్మెల్యే సీట్లలో పోటీని ప్రస్తావించారు. "2024 ఎన్నికల్లో ఒంగోలు అసెంబ్లీ స్థానం నుంచి నేనే పోటీ చేస్తాను. అలాగే ఒంగోలు ఎంపీగా మాగుంట శ్రీనివాసులురెడ్డి పోటీ చేస్తారు. కొంత మంది రకరకాలుగా మాట్లాడుతున్నారు. వారిని, వారి మాటల్ని నమ్మొద్దు" అని స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా బాలినేని అన్నారు. బాలినేని వ్యాఖ్యలు వైరల్ గా మారాయి. తన గురించి తాను చెప్పుకుంటే పర్లేదు. మధ్యలో ఒంగోలు పార్లమెంట్ స్థానం నుంచి మాగుంట శ్రీనివాసులరెడ్డి పోటీ చేస్తారని చెప్పడమే ఇక్కడ బాలినేని ఇచ్చిన ట్విస్ట్. ఇటీవలే వైవీ సుబ్బారెడ్డిని టీటీడీ చైర్మన్ గా తప్పించారు. ఆయన ఢిల్లీలో బిజీ అవుతారని అన్నారంతా. అంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైవీ ఒంగోలు పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసే అవకాశముంది. దీంతో ముందుగానే బాలినేని ట్విస్ట్ ఇచ్చారు. వాస్తవానికి ఇటీవల మద్యం కుంభకోణంలో మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు అరెస్ట్ కావడంతో ఆయన పార్టీపై అలిగారని సమాచారం. వచ్చే దఫా ఆయన టీడీపీ టికెట్ పై పోటీ చేస్తారనే ప్రచారం కూడా ఉంది. ఇప్పుడు టీటీడీ బాధ్యతలనుంచి వైవీని తప్పించడంతో ఆయన్ను ఒంగోలు తీసుకొస్తారని కూడా ప్రచారం జరుగుతోంది. అయితే ఇది ఇష్టంలేని బాలినేని ముందుగానే ఓ మాటవేసి ఉంచారు. ఒంగోలు పార్లమెంట్ స్థానం మాగుంట ఫ్యామిలీదేనన్నారు. తనని ఇబ్బంది పెట్టిన వైవీ సుబ్బారెడ్డిపై ఆగ్రహంతో ఉన్న బాలినేని, ఆయన ఒంగోలు వస్తాడంటే ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకునేలా లేరు. అందుకే బాలినేని ముందుగానే ఒంగోలు పార్లమెంట్ స్థానంపై ప్రకటన చేశారు. మంత్రి పదవి విషయంలో అధిష్టానంపై కూడా బాలినేని అలకతో ఉన్నారు. ఇన్ చార్జ్ పదవులు తనకు వద్దని గతంలోనే తేల్చి చెప్పారు. తాను ఒంగోలు అసెంబ్లీ స్థానానికే పరిమితం అవుతానన్నారు. ఓ దశలో ఆయన పార్టీ మారతారనే ప్రచారం జరిగినా.. ప్రస్తుతానికి బాలినేని వైసీపీలోనే ఉన్నారు. ఉన్నారు కానీ ఇలా సొంత పార్టీనే ఇరుకున పెట్టేలా మాట్లాడుతున్నారు. చివరకు సీఎం జగన్, బాలినేని వ్యవహారాన్ని ఎలా డీల్ చేస్తారో చూడాలి. ఒకవేళ మాగుంట చివరి నిమిషంలో వైసీపీకి హ్యాండిచ్చి టీడీపీలో చేరితే.. అక్కడ బాలినేనికి మాత్రం ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయి. ఎంపీగా కచ్చితంగా వైవీని తీసుకొస్తారు. మాగుంట బయటకు వెళ్లకపోయినా సీఎం జగన్ తలచుకుంటే.. ఒంగోలుకి వైవీ వచ్చి తీరుతారు. ఈ రెండిటిలో ఏది జరిగినా బాలినేనికి ఇబ్బంది తప్పకపోవచ్చు. అందుకే వైవీ రావడం తనకు ఇష్టం లేదని ఆయన ముందుగానే తేల్చి చెప్పారు.

# పైపైకి అరటి పండ్ల ధరలు

**బెంగళూరు, ఆగస్టు 16:**

నిన్న, మొన్నటి వరకు వంద నుంచి 300 వరకు కిలో పలికిన టమాటా ధర కాస్త తగ్గింది. ఇప్పుడిప్పుడు ఇతర కూరగాయల ధరలు కూడా తగ్గుతుండగా.. అరటి పండ్ల ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. తాజాగా బెంగళూరులో కిలో అరటి పండ్ల ధర రూ. 100కు చేరుకుంది. దీంతో కొనుగోలుదారులు గగ్గోలు పెడుతున్నారు. రైతుల నుంచి సరఫరా లేకపోవడం వల్ల ధరలు విపరీతంగా పెరిగాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. బెంగళూరులో విక్రయించే అరటి పండ్లలో ఎక్కువగా తమిళనాడు నుంచి వెళ్తుంటాయి. ఎలక్కిబలే, పచ్ బలే రకాలను బెంగళూరు వాసులు ఎక్కువ ఇష్టంగా కొనుగోలు చేసి తింటుంటారు. తమిళనాడు నుంచి ఈ రకం పండ్ల సరఫరా బాగా తగ్గిపోయింది. సుమారు రెండ్రోజుల క్రితం బన్నీపేట్ మార్కెట్ కు 1500 క్వింటాళ్ల ఎలక్కిబలే సరకు వస్తే.. ప్రస్తుతం అది వెయ్యి క్వింటాళ్లకు పడిపోయినట్లు అధికారులు వెల్లడించారు. బెంగళూరుకు వచ్చే అరటి పండ్లు తుమకూరు, రామ నగర, చిక్ బళ్లాపూర్, అనేకల్, బెంగళూరు రూరల్ కు పంపిణీ అవుతుంటాయి. తమిళనాడులోని హోసూరు, కృష్ణగిరి నుంచి ఎక్కువగా కర్ణాటకకు అరటి రవాణా అవుతుందని మార్కెట్ అధికారులు తెలిపారు. సరఫరా తగ్గిపోవడంతో హోల్ సేల్ లో ఎలక్కిబలే రకం కేజీ రూ. 78, పచ్ బలే రకం రూ. 18–20 పలుకుతోందని చెప్పారు. అన్ని ఖర్చులూ కలుపుకొని వ్యాపారులు వాటిని కిలో 100 రూపాయల నుంచి 40 రూపాయల వరకు విక్రయిస్తున్నట్లు తెలిస్తోంది. మరికొన్ని రోజుల్లో ఓనం, వినాయక చవితి విజయ దశమి పండగలు రాబోతుండగా.. ధరలు మరింత ఎక్కవయ్యే అవకాశం ఉందని వ్యాపారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం..

**వరంగల్**
వరంగల్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. లారీ ఒక ఆటోను ఢీకొన్న ఘటనలో నలుగురు మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. వర్ధన్నపేట మడలం ఇల్లందలో ఘటన చోటుచేసుకుంది. ఆటో వరంగల్ నుంచి తొర్రూరు వైపు వెళ్తుతుంది. దారిలో లారీ ఢీకొని ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు మృతి చెందారు. మృతులు తేనె విక్రయించుకునే కూలీలుగా సమాచారం. మద్యం మత్తులో లారీ నడపడమే ప్రమాదానికి కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు

## సిలిండర్ పేలి అగ్నిప్రమాదం

**మేడ్చల్**
మేడ్చల్ జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి పీర్జాదిగూడలోని శ్రీ సాయి నిలయంలో సెక్యూరిటీ ఉంటున్న గదిలో గ్యాస్ సిలిండర్ పేలి మంటలు పేలి చెలరేగాయి. ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మంటలకు, భారీగా కమ్మిన పొగకు స్థానికులు భయభ్రాంతులకు గురైయారు. రెండు అంతస్తుల భవనం గ్రౌండ్ ఫ్లోర్ లో సెక్యూరిటీ సిబ్బందికి ఇచ్చిన గదిలో ఘటన జరిగింది. వెంటనే స్పందించిన స్థానికులు, డి ఆర్ ఎఫ్ బృందం, అగ్నిమాపక సిబ్బంది మంటలను చల్లార్చారు.

## కడుపులో కత్తెర
### ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ల నిర్వాకం

**ఏలూరు**
ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగిన ఈ దారుణమైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది.. పూర్తి వివరాల్లోకి వెళ్తే, ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వారం క్రితం కాన్పు కోసం ఓ గర్భిణీ చేరింది. పరీక్షలు నిర్వహించిన వైద్యులు.. ఆమెకు సిజేరియన్ చేసి, పండంటి బిడ్డను బయటకు తీశారు. అంత వరకు బాగానే ఉన్నా, ఆపరేషన్ తర్వాత కుట్లు వేసే క్రమంలో కడుపులో ఉన్న కత్తెరను తీయడం మరిచిపోయారు. అయితే, అప్పటి నుంచి బాధితురాలు కడుపునొప్పితో తీవ్రంగా బాధపడుతోంది. దీంతో వైద్యులు ఎక్రే తీయించడంతో కడుపులో కత్తెర ఉన్న విషయం వెలుగు చూసింది.. ఈ ఘటనను బయటకు రాకుండా వైద్యులు జాగ్రత్తలు తీసుకున్నట్టు తెలిసింది .. ఆ ఎక్రే ఫొటోను ఓ ఉద్యోగి తన ఫేస్బుక్, ట్విటర్ ఖాతాల్లో పోస్టు చేయడంతో.. ఈ వ్యవహారం మొత్తం బయటకు వచ్చింది.. దీంతో, షాక్ తిన్న ఆస్పత్రి అధికారులు ఆ ఉద్యోగిని పిలిచి మందలించడంతో ఆ పోస్టులను తొలగించాడు. మరోవైపు.. ఆస్పత్రి రికార్డుల్లో బాధితురాలి వివరాలు కూడా మాయం చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై వైద్యులపై బాధితురాలి కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.

## సర్కారి బడులకు ఆర్థిక సహకారం



**శ్రీకాకుళం**
పాతపట్నం మండలంలోని పెద్దసిది, రొంపివలస, కొరసవాడ జిల్లా పరిషత్ పాఠశాలలకు, తామర, రౌతు లక్ష్మీపురం మండల పరిషత్ పాఠశాలల అభివృద్ధికి ప్రముఖ సామాజికవేత్త,పాతపట్నం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గోవిందరావు, ?50,000/- వేల రూపాయలు ఆర్థిక సహకారం అందించారు. ఈరోజు అతను తనయుడు డా.సాయి గణేష్, అనుచరుల ద్వారా విరాళం అందించారు. గత పది సంవత్సరాలుగా పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు, పాఠశాలలకు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆర్థిక సహకారం అందించడం జరుగుతూ ఉందని అయన అన్నారు.

## శ్రీనిధి యూనివర్సిటీ ముందు అందోళన
### ఎన్ఎస్యూఐ ఛీఫ్ బల్మూరి వెంకట్ అరెస్టు



**ఘట్కేసర్**
మేడ్చల్ జిల్లా ఘట్ కేసర్ లోని శ్రీనిధి యూనివర్సిటీకి పర్మిషన్ లేకున్నా విద్యార్థులనీ చేర్చుకొని విద్యార్థులను ఇబ్బంది కల్గిస్తున్న శ్రీనిధి యాజమాన్యానికి వ్యతిరేకంగా శ్రీనిధి కళాశాల వద్ద విద్యార్థులు చేస్తున్న ఆందోళనకి మద్దతుగా ఘట్ కేసర్ లోని శ్రీనిధి కళాశాలకు వెళ్తున్న రాష్ట్ర ఎన్ ఎస్ యూఐ అధ్యక్షుడు బల్మూరి వెంకట్ నీ, మేడిపల్లి వద్ద అరెస్ట్ చేసి మేడిపల్లి పోలీసు స్టేషన్ కి తరలించారు. మేడిపల్లి పోలీసు స్టేషన్ లోకి ఎవరిని అనుమతించడంలేదు.

# నర్సుపై డాక్టర్, సిబ్బంది సామూహిక హత్యాచారం

**పాట్నా, ఆగస్టు 16:**
బీహార్‌లో దారణం చోటుచేసుకుంది. ఓ నర్సుపై సామూహిక అత్యాచారం జరగడం ఆలస్యంగా వెలుగుచూసింది. తూర్పు చంపారణ్య జిల్లాలోని నర్సింగ్ హోమ్‌లో ఓ డాక్టర్, కంపౌండర్, అదే ఆసుపత్రిలోని ఉద్యోగం చేస్తున్నటువంటి ఇతర సిబ్బంది అక్కడ పనిచేస్తున్న నర్సుపై అత్యాచారం చేశారు. అంతేకాదు ఆ తర్వాత ఆమెను దారుణంగా హత్య చేశారు. సామాన్య ప్రజలకు నమ్మకస్థులైన వైద్యుడే ఇలాంటి దారణలకి పాల్పడటం ఏంటని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు ఆ డాక్టర్ కనబడితే చాలు.. అతనిపై చర్యలు తీసుకునేందుకు స్థానికులు గాలింపు చర్యలు చేపట్టారు. చంపారణ్య జిల్లాలోని మోతీహరిలోని జానకీ సేవా సదన్ నర్సింగ్‌హోమ్‌లో ఈ ఘటన చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అదే ఆసుపత్రికి చెందిన అంబులెన్స్‌లో నర్సు మృతదేహం కనిపించడం వల్ల ఈ హత్య విషయం వెలుగులోకి వచ్చినట్లు పేర్కొన్నారు.ఇక వివరాల్లోకి వెళ్తే ఆగస్టు 8వ తేదిన ఆ నర్సు రోజువారిగానే ఆస్పత్రిలో పని చేయడానికి వెళ్లింది. కానీ ఎప్పుడు ఇంటికి వచ్చే సమయానికి ఆమె రాలేకపోయింది. తన కోసం చాలాసేపు ఎదురుచూశారు. అయినా కూడా ఆ నర్సు ఇంటికి రాలేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యుల్లో ఆందోళన మొదలైంది. అదృశ్యం అయినటువంటి తమ కూతురు కోసం అనేక చోట్ల వెతికారు. కానీ ఎక్కడా కూడా ఆమె ఆచూకి దొరకలేదు. చివరికి నర్సింగ్ హోమ్‌కే వెళ్లారు. కానీ అక్కడ కూడా లోపల కనిపించలేదు. ఇక అంబులెన్స్‌లో చూడగా ఆమె మృతదేహం కనిపించింది. దీంతో ఒక్కసారిగా తన కుటుంబ సభ్యులు హడలిపోయారు. సమాచారం అందుకున్న వైద్యులు అక్కడికి వచ్చారు. ఇక ఆమె శవానికి పోస్టుమార్టం చేశారు. ఆ రిపోర్టులో నర్సు మీద సామూహిక అత్యాచారం చేసి హత్య చేసినట్లు తేలింది. దీంతో ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడు కాంపౌండర్‌ను అదుపులోకి తీసుకున్నారు. డాక్టర్‌తో పాటు మరో ముగ్గరు నిందితుల కోసం గాలిస్తున్నారు.ప్రస్తుతం ఆ నర్సు పనిచేసినటువంటి నర్సింగ్ హోమ్‌ను సీజ్ చేశారు. వైద్యుడు జయప్రకాశ్‌తో పాటు మరో ఐదుగురిపై బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వాస్తవానికి వైద్యులు, ఇతర సిబ్బంది వేధింపుల వల్ల ఆ నర్సు గత కొన్ని రోజులుగా విసిగిపోయినట్లు తెలిసింది. ఇందుకోసం కొంతకాలం పాటు ఆమె ముందుగానే పనికి వెళ్లడం మానేసింది. కానీ ఇలాంటివి మరోసారి జరగకుండా చూస్తానని డాక్టర్‌తో పాటు అక్కడ పనిచేసే సిబ్బంది ఆమెకు క్షమాపణలు చెప్పినట్లు పోలీసుల విచారణలో తెలిసింది. ఆ తర్వాత ఆమె ఉద్యోగం చేయడానికి వెళ్లిందని పేర్కొన్నారు. ఇంతలోనే ఈ దారుణం చేసుకున్నట్లు వివరించారు. మరోవైపు ఇలాంటి దారుణానికి పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలంటూ స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# మళ్లీ బ్యాక్ టూ డబ్బా ఫోన్

**హైదరాబాద్, ఆగస్టు 16 :**
స్మార్ట్ అంటే చాలా మంది ఆసక్తి చూపుతారు. రోజుకొక బ్రాండ్.. పూటకొక అప్‌డేటెడ్ వెర్షన్‌తో మార్కెట్‌లోకి విడుదలవుతున్న స్మార్ట్ ఫోన్స్‌ని కొనేందుకు ఫోన్ లవర్స్ విపరీతమైన ఆసక్తి చూపుతుంటారు. ధనవంతులైతే.. కొత్తగా ఏ స్మార్ట్ ఫోన్ విడుదలైతే.. ఆ స్మార్ట్ ఫోన్‌ను కొనేస్తారు. అలాంటి వారిలో రాజకీయ నాయకులు సైతం ఉంటారు. ఈ కాలంలో స్మార్ట్ లేని నాయకుడైతే లేడనే చెప్పాలి. కానీ, ఇక్కడి నేతలు మాత్రం స్మార్ట్ ఫోన్ అంటేనే భయపడిపోతున్నారు. అమ్మ బాబోయ్ స్మార్ట్ ఫోనా.. నాకొద్దు అంటూ పక్కకు పోతున్నారు. స్మార్ట్ ఫోన్ వద్దు.. డబ్బా ఫోనే ముద్దు అంటూ అలనాటి ఫోన్లను వినియోగించేందుకే ఆసక్తి చూపుతురున్నారు. అవును, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అంతా ఇప్పుడు కొత్త ఫోన్‌లు కొంటున్నారట. కొత్త ఫోన్లంటే.. లక్షల రూపాయలు పెట్టి స్మార్ట్ ఫోన్ లు కాదండోయ్.. జస్ట్ రూ. 15,00 పెట్టి ఫీచర్ ఫోన్‌ను కొంటున్నారట. అదేంటి అధికార పార్టీ ఎమ్మెల్యే ఎంది..? సన్న పిన్ను ఛార్జర్ ఫోన్‌లు కొనుడేంది? అని ఆశ్చర్యపోతున్నారు. అందుకు ఓ రిజన్ ఉంది మరి. ఈ కాలంలో ఎమ్మెల్యేలు అంటే.. సోకు సోకు కార్లు.. లక్షల రూపాయల ఫోన్ల మినియోగించే పరిస్థితి ఉంది. అలాంటిది.. స్మార్ట్ ఫోన్లు తప్ప.. ఎవరైనా ఫీచర్ ఫోన్‌లు కొంటున్నారా? కానీ తెలంగాణలో అధికార బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే లు, మంత్రులు అంతా పాతకాలం నాటి ఫోన్‌ల వెంట పడ్డారట. ఆండ్రాయిడ్ ఫోన్‌లు, ఆపిల్ ఫోన్‌లు పీఏ లు, గన్ మెన్ లకు ఇచ్చి.. చిన్న ఫోన్ లను మాత్రం తమ వద్ద ఉంచుకుంటున్నారట లీటర్లు.ఇక ఆ ఫోన్ లలో ఉండే నంబర్.. ఒక్కరికే ఇచ్చారట. వాళ్ళ ఇంటివారికి కూడా ఆ నెంబర్ తెలియదట. అన్ని ఫోన్లకు సైలెంట్ మోడ్ ఉన్నా.. స్విచ్ ఆఫ్ చేసినా.. ఆ చిన్న ఫోన్ మాత్రం పెద్ద రింగ్ టోన్ పెట్టుకొని.. పై జెబుల వేసుకుంటున్నారట. ఎప్పుడు మోగుతదా.. ఎప్పుడు ఎత్తుదమా అని ఎదురుచూస్తున్నరట. చిన్న ఫోన్‌ల స్టోరీ వెనక లీడర్లకు పెద్ద ప్లానే ఉందట. ఆ ఫోన్‌ల ఉండే నెంబర్‌ను ఒక్క ప్రగతి భవన్‌ల మాత్రమే ఇచ్చారట. ఎన్నికల టైం కాబట్టి.. అక్కడి నుంచి ఎప్పుడు ఫోన్ వచ్చినా వెంటనే కలిసేట్లు ఉండేందుకే ఈ ప్లాన్ వేశారట. టిక్కెట్లు ఇచ్చే సమయం దగ్గర పడటంతో.. ప్రగతి భవన్ నుంచి ఎప్పుడు అయినా ఫోన్ రావొచ్చు. చిన్న ఫోన్‌లు అయితే.. సిగ్నల్ ఉండటం, పై జెబుల పెట్టుకోవడం ఈజీ కావడంతో లీడర్లు ఈ ప్లాన్ చేశారట.పెద్ద పెద్ద స్మార్ట్ ఫోన్‌లు ఉన్నా.. ఈ మూడు నెలలు ఈ చిన్న ఫోన్ లకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మంత్రులు. గతంలో స్మార్ట్ ఫోన్‌లు ఎత్తక పోవడంతో చాలా ప్రాబ్లెమ్ వచ్చాయట. ప్రగతి భవన్‌కు అందుబాటులో ఉండాలంటే చిన్న ఫోన్‌లకు మించినది లేదని కొందరు మంత్రులు ఫాలో అవుతున్నది చూసి.. మిగతా వారంతా అదే పాటిస్తున్నారట

# వారం రోజుల్లో చంద్రుడిపైకి చంద్రయాన్

**బెంగళూరు, ఆగస్టు 16:**
చంద్రయాన్-3ని చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసి చరిత్ర సృష్టించాలని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) భావిస్తోంది. అమెరికా, రష్యా, చైనాల సరసన చేరి, ప్రపంచంలో ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా అవతరించాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. చంద్రయాన్-3 ద్వారా భారత్ చంద్రుని ఉపరితలంపై రెండో సారి సాఫ్ట్ ల్యాండింగ్ చేయడానికి యత్నిస్తోంది. 2019 చంద్ర మిషన్, చంద్రయాన్-2 తరువాత ఈ ప్రయోగం చేస్తోంది. ఇది చంద్రుని ఉపరితలంపై సురక్షితమైన ల్యాండింగ్ కోసం ఇస్రో ఎండ్-టు-ఎండ్ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి జూలై 14న చంద్రయాన్-3ని విజయవంతంగా ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఈ అంతరిక్ష నౌక ఆగస్టు 23న చంద్రుడి ఉపరితలంపై ల్యాండ్ అవనుంది. ఇప్పటికే అంతరిక్ష నౌక ఇటీవల చంద్రుడి దూరంలో మూడింట రెండు వంతుల దూరాన్ని కవర్ చేసింది. ఆగస్టు 23న చంద్రుడి ఉపరితలంపై చంద్రయాన్ ల్యాండింగ్ అయితే చరిత్ర సృష్టించినట్లే.చంద్రుడిపై చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్‌ను నిర్ధారించడానికి వివిధ ఎలక్ట్రానిక్, మెకానికల్ సబ్‌సిస్టమ్‌లతో కూడిన నావిగేషన్ సెన్సార్లు, ప్రొపల్షన్ సిస్టమ్‌లు ఉన్నాయి. వాటితో పాటుగా రోవర్‌ను సురక్షితంగా దించడానికి టూ-వే కమ్యూనికేషన్-సంబంధిత యాంటెనాలు, ఇతర ఆన్‌బోర్డ్ ఎలక్ట్రానిక్స్ యంత్రాంగాలు ఉన్నాయి. చంద్రయాన్ ప్రధాన లక్షాలు మొదటగా సురక్షిత ల్యాండింగ్ చేయడం, చంద్రుడిపై రోవర్‌ను దించడం, ఇన్-సిటు శాస్త్రీయ ప్రయోగాలు చేయడమే. చంద్రయాన్-3 అభివృద్ధి దశ జనవరి 2020లో ప్రారంభమైంది. 2021లో ప్రయోగించాల్సి ఉంది. అయితే కోవిడ్-19 మహమ్మారి కారణంగా మిషన్ కొంత కాలం వాయిదా పడుతూ వచ్చింది. 2019లో చంద్రయాన్-2 చంద్రుని ఉపరితలంపై సాఫ్ట్ ల్యాండింగ్ సమయంలో సవాళ్లను ఎదుర్కొన్న సవాళు ,, ప్రధాన మిషన్ విఫలమడంతో శాస్త్రవేత్తలు చంద్రయాన-3కి శ్రీకారం చుట్టారు. చంద్రయాన్-1 మిషన్ సమయంలో ఉపగ్రహం చంద్రుని చుట్టూ 3400 కంటే ఎక్కువ సార్లు తిరిగింది. ఆగష్టు 29, 2009న అంతరిక్ష నౌకతో కమ్యూనికేషన్ కోల్పోవడంతో మిషన్ ముగిసింది. తాజాగా ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) చైర్మన్ సోమనాథ్ గత వారం చంద్రయాన్ 3 పురోగతిపై విశ్వాసం వ్యక్తం చేశారు. అన్ని వ్యవస్థలు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నాయని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం అంతా సవ్యంగా జరుగుతోందని, ఆగస్ట్ 23న చంద్రునిపై ల్యాండింగ్ చేసేందుకు వరకు వరుసగా కక్ష్య విన్యాసాలు చేస్తున్నామన్నారు. ఇస్రో మాజీ డైరెక్టర్ శివన్ గతంలో మాట్లాడుతూ.. మిషన్ చంద్రయాన్-3 విజయం భారతదేశపు మొట్ట మొదటి మానవ సహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్ వంటి కార్యక్రమాలకు ధైర్యాన్ని ఇస్తుందన్నారు. దేశ అంతరిక్ష రంగం ఆవిష్కరణలో కీలకపాత్ర పోషించిన మాజీ ఇస్రో శాస్త్రవేత్త నంబి నారాయణన్ మాట్లాడుతూ.. చంద్రయాన్-3 మిషన్ విజయవంతమవుతుందని భారతదేశానికి గేమ్-ఛేంజర్ అవుతుందన్నారు. భారతీయ రాకెట్లన్నింటిలో ప్రధానమైన 'వికాస్ ఇంజిన్'ను అభివృద్ధి చేయడం, దేశం ఖూఒఎ రాకెట్ల యుగంలోకి ప్రవేశించడంలో కీలకంగా పని చేసిన శాస్త్రవేత్త నారాయణన్ మాట్లాడుతూ.. చంద్రయాన్-3 విజయవంతం అవుతుందని నమ్ముతున్నట్లు చెప్పారు. చంద్రయాన్-2లో వచ్చిన ప్రతి సమస్యలను అధ్యయనం చేశామని, వాటిని సరిదిద్దుతూ చంద్రాయాన్-3 రూపొందించినట్లు చెప్పారు. చరిత్ర పరంగా చూస్తే అంతరిక్ష నౌకలు ప్రధానంగా ఆపరేట్ చేయడానికి అనుకూలంగా ఉండేందుకు చంద్రుని మధ్యరేఖ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకున్నాయి. అయితే భూమధ్యరేఖ ప్రాంతంతో పోలిస్తే చంద్ర దక్షిణ ధ్రువం చాలా భిన్నమైనది, మరింత సవాలుతో కూడుకున్నది. నిర్దిష్ట ధ్రువ ప్రాంతాలలో సూర్యరశ్మి చాలా తక్కువగా ఉంటుంది. దీని ఫలితంగా ఉష్ణోగ్రతలు -230 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుని శాశ్వత చీకటి ప్రాంతాలు ఉంటాయి. ఈ సూర్యకాంతి లేకపోవడం, విపరీతమైన చలి అంతరిక్ష నౌకల ఆపరేషన్, స్థిరత్వానికి ఇబ్బందులు కలిగిస్తాయి. చంద్రుని దక్షిణ ధ్రువం మానవులకు, అంతరిక్ష నౌకలకు సవాళ్లను విసురుతుంది. అయితే ఇది ప్రారంభ సౌర వ్యవస్థ గురించి విలువైన సమాచారం తెలుసుకోవడానికి దోహదంచేస్తుంది. భవిష్యత్తులో లోతైన అంతరిక్ష అన్వేషణను ప్రభావితం చేసే ఈ ప్రాంతాన్ని అన్వేషించడం చాలా కీలకం.

## తాగి రాంగ్ రూట్‌లో లారీ నడిపి ఆటోను ఢీకొట్టిన డ్రైవర్.. ఐదుగురు స్పాట్ డెడ్



**వరంగల్**
వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వరంగల్ నుంచి తొర్రూరు వైపు వెళ్తున్న ఆటోను ఎదురుగా వచ్చిన ఓ లారీ ఢీకొట్టిన ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్నఐదుగురు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆటోలో చిక్కుకుపోయిన మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.లారీ డ్రైవర్‌ను రాజస్థాన్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. మద్యం మత్తులో లారీని రాంగ్‌రూట్‌లో నిర్లక్ష్యంగా నడపడం వల్ల ప్రమాదం జరిగినట్టు ప్రాథమికంగా గుర్తించారు. బాధితులను తేనె విక్రయించే కూలీలని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు...!

## ముచ్చుమరి ఎత్తిపోతల పథకం నుండి కేసీ కాలువకు నీళ్లు విడుదల చేయాలి

**జూపాడు బంగ్లా**
పగిడ్యాల మండలం తూర్పు ప్రాతకోట గ్రామంలో ఉమ్మడి కర్నూలు జిల్లా బిజెపి మాజీ అధ్యక్షుడు పిట్టం ప్రతాప్ రెడ్డి బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. కేసీకినాలకు ఇంతవరకు నీటిని విడుదల చేయకపోవడం శోచనీయమని అన్నారు శ్రీశైలం జలాశయంలో నీటి నిలువ ఉన్నప్పటికీ ముచుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి నీటిని కేసీ కెనాల్ కు ఇంతవరకు ఎందుకు నీరు విడుదల చేయలేదని ప్రభుత్వం ఎందుకు రైతులపై దృష్టి పెట్టలేదని ప్రశ్నించారు. కర్నూల్ కడప కాలువ క్రింద దాదాపుగా లక్ష డెభై వేల ఎకరాలు ఆయకట్టు ఉందని మొక్కజొన్న ప్రత్తి పొద్దు తిరుగుడు కడప జిల్లా ప్రాంతంలో వేరుశనగ పంట వేయడం జరిగిందన్నారు. కెనాల్ ఆయకట్టు రైతులు అరకొర వర్షానికి ఈ పంటలను విత్తుకోవడం జరిగినది ఈ పంటల విత్తనాలు భూమిలో వేసి దాదాపుగా నెల రోజులు కావచ్చున్నది సరైన వర్షాలు లేక ఈ పైర్లు ఎండిపోయే దశలో ఉన్నయని రైతులు ఇప్పటివరకు ఎకరాకు15 నుంచి 20వేల వరకు ఖర్చు పెట్టడం జరిగినది కావున ప్రభుత్వం స్పందించి వెంటనే ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి నీటిని విడుదల చేయవలసినదిగా భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తున్నది. నీటి పారుదల శాఖ అధికారులు నిటిని విడుదల చేయాలని ప్రతాపరెడ్డి గారు అన్నారు

## మహిళలకు క్యాన్సర్ అవగాహన శిబిరం

**కావలి**
స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా కావలి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్ వారి సహకారంతో రోటరీ కమ్యూనిటీ క్లబ్ నందు 40 సంవత్సరాల పైబడిన మహిళలు 100 మంది పాల్గొన్నారు. వారిలో గర్భసంచి ముఖ ద్వారా క్యాన్సర్ స్కానింగ్ పరీక్ష నిర్వహించి క్యాన్సర్ పై డాక్టర్ పి జి ఎస్ ఆర్ ప్రియా ఎండి రేడియాలజిస్ట్ గారు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామిరెడ్డి ఆదిలక్ష్మి పాల్గొని క్యాంపును ప్రారంభించారు. కార్యక్రమాన్ని కొనియాడారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి పట్టణ మహిళా అధ్యక్షురాలు అనురాధ వైయస్సార్సీపి నాయకురాలు ఎన్ సీతారామమ్మ పాల్గొన్నారు .ఈ క్యాంపును డాక్టర్ ఎన్ రేవంత్, డాక్టర్ టి రమ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు సిహెచ్ దినేష్ మాట్లాడుతూ ఈ క్యాంపుకు సహకరించిన రోటరీ రీజనల్ కోఆర్డినేటర్ డాక్టర్ కె మాధవరెడ్డి ఎం అరుణ గోపి కృష్ణ ఎం వెంకటేశ్వర్ రెడ్డి చిన్న వెంకటరామయ్య సలీం బేగం ఓరుగంటి వెంకటేశ్వర్లు ఇన్నర్ వీల్ సిస్టర్ మరియు ఐఎంఏ డాక్టర్స్ డాక్టర్ లక్ష్మీనారాయణ డాక్టర్ నలిని పద్మజా డాక్టర్ మనోహర్ బాబు డాక్టర్ భారతి కి అభినందనలు తెలియజేశారు.

## సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు

**శ్రీకాకుళం**
శ్రీకాకుళం నగర కార్పొరేషన్ పరిధిలో గల స్థానిక డే నైట్ జంక్షన్ దగ్గర సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించిన పార్లమెంట్ సభ్యులు ఎం.పీ కింజరాపు రామ్మోహన్ నాయుడు,జిల్లా పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కూన రవి కుమార్,శ్రీకాకుళం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ మాజీ ఓఎం గుండ లక్ష్మీదేవి మరియు టిడిపి నాయకులు నగర పార్టీ అధ్యక్షులు మాదారాపు వెంకటేష్. రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి. శ్రమణ మాదిగ. తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు. పీఎంజే బాబు చిట్టి మోహన్..బొనిగి భాస్కరరావు అధికార ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు బొక్క యుగంధర్ రానంకి కళ్యాణ్. రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి. దుంగ భాస్కర్. మెండ దాస్ నాయుడు.. కొవ్వాడ సుశీల. సీర రమణయ్య. టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు బలగా ప్రహర్ష జిల్లా లీడర్ సల్ అధ్యక్షులు గోర అనిల్ కొవ్వాడ సుశీల. మల్ల అబ్బాయినాయుడు.నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రావణమాసంలో... పార్టీల తొలి జాబితా

**హైదరాబాద్, ఆగస్టు 16:**

తెలంగాణ రాజకీయాల్లో తొలి జాబితా సందడి కనిపిస్తోంది. అన్ని ప్రధాన రాజకీయ పార్టీల నుంచి తొలి జాబితా రెడీ అయిందంటూ లీకులు మీడియాకు వస్తున్నాయి. శ్రావణ శుక్రవారం మంచి ముహూర్తం అని ప్రకటించేస్తామని ఊరిస్తున్నాయి. షెడ్యూల్ ప్రకారం అయితే.. డిసెంబర్ మొదటి వారంలో పోలింగ్ ఉంటుంది. అక్టోబర్ లో షెడ్యూల్ ఉంటుంది. అయినా ముందుగానే రాజకీయ పార్టీలు తొలి జాబితా గురించి ప్రకటనలు చేస్తున్నాయి. నిజంగా ప్రకటించడానికి మాత్రం అవకాశం లేదని.. అయితే బీఆర్ఎస్ ప్రకటిస్తుంది కానీ.. జాతీయ పార్టీలు ప్రకటించే అవకాశం లేదని .. రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ ఎన్నికలకు పూర్తి స్థాయిలో సిద్ధమయ్యారు. అభ్యర్థుల కసరత్తును ఇప్పటికే పూర్తి చేశారు. మంచి రోజు చూసుకుని విడుదల చేయాలనుకుంటున్నట్లుగా తెలుస్తోంది.బీఆర్ఎస్ చీఫ్, సీఎం కేసీఆర్ అభ్యర్థులపై ఇప్పటికే ఓ అంచనాకు వచ్చారు జాబితా కూడా రెడీ చేసుకున్నారు. ఈ నెల 17 నుంచి శ్రావణ మాసం ప్రారంభమవుతుంది. 18న శ్రావణ మొదటి శుక్రవారం ఉంది. అదే రోజు లేదా ఆ తర్వాత బీఆర్ఎస్ అభ్యర్థుల మొదటి జాబితాను కేసీఆర్ ప్రకటించే అవకాశముందని బీఆర్ఎస్ పార్టీ నేతలు చెప్తున్నారు. ఫస్ట్ లిస్టులోనే 105 పేర్లు ప్రకటించే అవకాశముందని కూడా అంచనా వేస్తున్నారు. ఒకవేళ 105 పేర్లు ప్రకటించకుంటే.. కేసీఆర్ లక్కీ నంబర్అయిన ‘6’ సంఖ్య వచ్చేలా అభ్యర్థుల లిస్ట్ ఉండొచ్చని చెప్తున్నారు. పదేళ్లుగా అధికారంలో ఉండటంతో సిట్టింగ్ ఎమ్మెల్యేలపై అసంతృప్తి ఉందని సర్వేల్లో తేలింది. 40 మంది ఎమ్మెల్యేలపై అసంతృప్తి ఉందని.. వారిలో అతి ఎక్కువ వ్యతిరేకత ఉన్న 20 మందిని మార్చి కొత్తవాళ్లకు అవకాశం ఇవ్వనున్నట్టు చెబుతున్నారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, ఎమ్మెల్సీ కవిత ఇప్పటికే వేర్వేరు వేదికలపై అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యేలను భారీ మెజార్టీతో గెలిపించాలంటూ పిలుపునిచ్చారు. తద్వారా ఆ సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు ఖరారు అయినట్టు సంకేతాలు ఇచ్చారు. కాంగ్రెస్, వీరిలో కాంగ్రెస్ , టీడీపీ నుంచి బీఆర్ఎస్‌లో జాయిన వారికి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఒక్క వనమా వెంకటేశ్వర రావుకు మాత్రం ఇంకా ఖరారు చేయలేదని చెబుతున్నారు.తెలంగాణలో అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ వ్యూహాలు రచిస్తోంది. బీఆర్ఎస్ కంటే ముందుగా అభ్యర్థులను ఖరారు చేసి ఎన్నికలకు అభ్యర్థులను సమాయత్తం చేయాలని నిర్ణయించింది. అందుకు అనుగుణంగానే పావులు కదుపుతోంది. కర్ణాటక ఎన్నికల జోష్‌ను తెలంగాణలోనూ కంటిన్యూ చేయాలని భావిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. తొలి జాబితాపై కసరత్తు పూర్తి చేసిన రాష్ట్ర నేతలు జాతీయ నాయకత్వానికి పంపినట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ జాబితాకు హైకమాండ్ ఆమోదం తెలిపితే త్వరలోనే అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉందని చెబతున్నారు. కొంత మంది పేర్లతో ఓ జాబితా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అన్ని పార్టీల కంటే ముందుగానే ఓ జాబితాను విడుదల చేస్తే అసంతృప్తులను బుజ్జగించేందుకు సమయం ఉండటంతో పాటు విస్తృత ప్రచారానికి సమయం దొరుకుతుందని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది.రాష్ట్రంలో బీజేపీ నుంచి ఉన్న నలుగురు ఎంపీలతోపాటు, సీనియర్ నేతలంతా అసెంబ్లీకి పోటీ చేయాలని బీజేపీ అధిష్టానం ఆదేశించినట్టుగా తెలుస్తోంది. అయితే మొత్తంగా 60 మంది అభ్యర్థులతో మొదటి జాబితాను విడుదల చేయాలనే నిర్ణయంతో బీజేపీ అధిష్టానం ఉన్నట్టుగా తెలుస్తోంది. ఇందుకోసం వివిధ జిల్లాల నుంచి డేటా సేకరించే కసరత్తు కూడా ప్రారంభమైందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నెల 27న ఖమ్మం జిల్లాలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా పర్యటించబోతున్నారు. భద్రాద్రి రాముడి సన్నిధి నుంచి సమర శంఖం పూరించాలని కమలనాథులు భావిస్తున్నారు. ఆ లోపు తొలి జాబితా ప్రకటించే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే జాతియ పార్టీల్లో అభ్యర్థుల ప్రకటన అంత తేలిక కాదు. ఆ పార్టీల కేంద్ర ఎన్నికల కమిటీలు గ్రీన్ సిగ్నల్ ఇస్తేనే ప్రకటిస్తారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాతనే నిర్ణయం తీసుకుంటారు. కానీ బీఆర్ఎస్ పార్టీ పెద్దలు మాత్రం అనుకున్నట్లుగానే అభ్యర్థుల్ని ప్రకటించే చాన్స్ ఉంది.

# ఛలో హైదరాబాద్...క్యూ కడుతున్న రియాల్టర్లు

**హైదరబాద్, ఆగస్టు 16 :**

హైదరాబాద్ లో స్థిర నివాసాల ఏర్పాటుకు ప్రజల్లో ఆసక్తి పెరుగుతోందని క్రెడాయ్ తెలిపింది. ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు కూడా హైదరాబాద్ లో స్థిరాస్తుల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారని పేర్కొంది. హైదరాబాద్ విశ్వనగరంగా మారుతోంది. రోజు రోజుకూ తన పరిధిని విస్తరించుకుంటూ ఆధునిక హంగులను అద్దుకుంటుంది. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటి. ఈ అనుకూలతలతో ఇక్కడ స్థిరపడేందుకు ప్రజలు మొగ్గుచూపుతున్నారు. ఉత్తరాది రాష్ట్రాల వాళ్లు కూడా హైదరాబాద్ లో ఎక్కువగా ఇళ్లు కొంటున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగ, వ్యాపారాల కోసం భాగ్యనగరానికి వస్తున్న వాళ్లు ఇక్కడే శాశ్వత నివాసాలు ఏర్పాటు చేసుకునేందుకు నిర్ణయించుకుంటున్నారు. దీంతో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం రాకెట్ వేగంతో దూసుకుపోతుంది. ముఖ్యంగా ఇళ్ల కొనుగోలు గత ఏడాదితో పోలిస్తే ఎక్కువగా ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఉత్తరాదీ చెందిన వ్యాపారులు, అధికారులు, ఉద్యోగులు ఖాళీ స్థలాలు, విల్లాలు కొనేందుకు మొగ్గ చూపుతున్నారు. మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులు అపార్ట్‌మెంట్లలో 3 బీహెచ్‌కే ఫ్లాట్లకు ఆసక్తి చూపుతున్నారు.హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో కొనుగోళ్లలో అత్యధికంగా ఢిల్లీ, గుజరాత్, పంజాబ్ వాసులు ఉంటున్నారని రియల్ ఎస్టేట్ నిపుణులు అంటున్నారు. స్థానిక బిల్డర్స్ నార్త్ ఇండియన్స్‌తో కలిసి భారీ మొత్తంలో ప్రాజెక్టులు చేపట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. హైదరాబాద్ లో ఉన్న బిల్డర్లు, డెవలపర్లకు స్థానికంగా గట్టి పట్టు ఉండటంతో నార్త్ ఇండియన్ కంపెనీలు వారితో కలిసి ప్రాజెక్టులు చేస్తున్నాయని క్రెడాయ్ ప్రతినిధులు చెబుతున్నారు. కొవిడ్ తర్వాత ఉద్యోగ విధానాలు మారాయి. చాలా కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోం, హైబ్రిడ్ విధానాలు అమలుచేస్తున్నాయి. దీంతో సాఫ్ట్ వేర్ ఉద్యోగులు హైదరాబాద్ లో ఇళ్లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. హైదరాబాద్ లో పెట్టుబడి పెడితే రెట్టింపు ప్రయోజనం ఉంటుందని ప్రజలు భావిస్తున్నారని నిపుణులు అంటున్నారు.హైదరాబాద్ చుట్టూ భారీగా మౌలికసదుపాయాల ప్రాజెక్టులు వస్తుండటంతో కొనుగోలు దారులు ఆసక్తి చూపుతున్నారు. అద్దెల రాబడి కూడా ఎక్కువగా ఉండటంతో స్థిరాస్తి రంగంపై మొగ్గుచూపుతున్నారని హైదరాబాద్ క్రెడాయ్ ప్రతినిధులు తెలిపారు. మెట్రో సౌకర్యం అందుబాటులోకి రావడంతో ఉప్పల్, ఎల్బీనగర్ వంటి శివారు ప్రాంతాల్లో కూడా రియల్ ఎస్టేట్ పుంజుకుందని, కొనుగోలుదారులు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. వరంగల్ మార్గంలో ఘట్‌కేసర్ వరకు ఇళ్లు, అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు కొనుగోళ్లు పెరిగాయని క్రెడాయ్ తెలిపింది. హైదరాబాద్ లో ఎక్కడ ఆఫీస్ ఉన్నా గంటలోపే చేరుకునే రవాణా సదుపాయాలు ఉండటంతో శివారు ప్రాంతాల్లో కూడా కొనుగోళ్లు పెరిగాయని పేర్కొంది. నాగోలు, బండ్లగూడ, హస్తినాపురం, బీఎన్‌రెడ్డి నగర్, వనస్థలిపురం, హయత్‌నగర్ వరకు ఇళ్లు, అపార్ట్ మెంట్ కు డిమాండ్ పెరిగిందని తెలిపింది.

# ఔటర్ చుట్టూ సోలార్ రూఫ్ సైకిల్ ట్రాక్

**హైదరాబాద్, ఆగస్టు 16:**

మహానగర మణిహారమైన ఔటర్ రింగ్ రోడ్డుకు మరింత సొబగులిచ్చేందుకు మరో ముత్యం చేరబోతుంది. అదే అంతర్జాతీయ స్థాయిలో నిర్మించిన సోలార్ రూఫ్ సైకిల్ ట్రాక్. ఓఆర్ఆర్ వెంట 23 కిలోమీటర్ల దేశంలోనే అతిపొడవైన సోలార్ రూఫ్ సైకిల్ ట్రాక్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. నగర కాలుష్య రహిత యాక్టివ్ మొబిలిటీలో భాగంగా ఐటీ కారిడార్ లో సైక్లిస్టులకు ఉపయోగపడేలా అత్యాధునికి వసతుల సైకిల్ ట్రాక్ గెట్ రెడీ అంటోంది.నగరంలో వాహనాలతో నిండిన నిత్య రద్దీ రోడ్లపై సైకిల్ సవారీ ఓ సవాలు. ఫిట్ నెస్, పర్యావరణహిత, యాక్టివ్ మొబిలిటీలో భాగమైన సైకిల్ రైడ్ కు యువత మొగ్గుచూపుతున్న తరుణంలో దానికి అనువైన ట్రాక్ కోసం ఎదురుచూస్తున్నారు. అలాంటి వారికోసం ప్రభుత్వం ఓఆర్ఆర్ వెంట ఓ అద్భుతాన్నే ఆవిష్కరించింది. ప్రపంచస్థాయి ప్రమాణాలతో 23 కిలోమీటర్ల పొడవైన సోలార్ రూఫ్ సైకిల్ ట్రాక్ నిర్మాణం చేసింది. ఓ నెటిజన్ ట్వీట్ తో మంత్రి కేటీఆర్ ఆదేశాలతో ఔరా అనిపించే సైకిల్ ట్రాక్ రెడీ అయిపోయింది.రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఐటీ కారిడార్ లో నానక్ రాంగూడ్ ఓఆర్ఆర్ ఇంటర్ చేంజ్ నుంచి తెలంగాణ పోలీస్ అకడామీ వరకు 8.5 కిలోమీటర్లు, మరోవైపు నార్సింగ్ నుంచి కొల్లురు వరకు 14.5 కిలోమీటర్ల మేర సోలార్ రూఫ్ తో సైకిల్ ట్రాక్ ఏర్పాటు చేసింది. తుది మెరుగులతో ఓపెనింగ్ కు రెడీ అయింది ఈ ట్రాక్. ఓఆర్ఆర్ వెంట ఇప్పటికే ఎయిర్ పోర్టు మెట్రో, వాటర్ రింగ్ మెయిన్ వంటి కీలక ప్రాజెక్టులు వస్తున్నాయి.వాటికి తోడు ఈ సోలార్ రూఫ్ సైకిల్ ట్రాక్ తోడవడంతో మణిహారంలాంటి ఓఆర్ఆర్ లో మరిన్ని ముత్యాలు పొదిగినట్లు అవుతుందని అంటున్నారు. సైక్లిస్టులు సురక్షితంగా ప్రయాణించే మార్గంతో పాటు పైన ఉన్న సోలార్ ప్లేట్లతో దాదాపు 16 మెగావాట్ల విద్యుత్ ను ఉత్పత్తి చేయనున్నారు. ఈ ఉత్పత్తి చేసిన కరెంట్ ను ఓఆర్ఆర్ వెంట్ డ్రిప్ ఇరిగేషన్, స్ట్రీట్ లైట్ల కోసం వినియోగించాలని హెచ్ఎండీఏ ప్రణాళికలు సిద్ధం చేసింది. 90 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ ట్రాక్ ను ఆగస్టు 15కు ప్రారంభించాలని అనుకున్నా.. పనులు పూర్తి కాకపోవడంతో సెప్టెంబర్ మొదటి వారంలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.24 గంటల ఫెసిలిటీ.. 23 కిలోమీటర్ల స్ట్రెచ్.. 4.5 మీటర్ల వెడల్పు.. 3 వరసల్లో సైకిళ్లు వెళ్లేలా ట్రాక్. ఇది ఈ సైకిల్ ట్రాక్ రికార్డు. విదేశాల్లో ఇలాంటి ట్రాక్స్ ఉండగా అక్కడ ఆఫీస్ ల సమీపంలో ఇళ్లు ఉంటే సైకిల్ మీదే ఆఫీస్ కు వెళ్లేలా ఇది ఉపయోగపడుతుంది. ఇక్కడ కూడా సేమ్ ఐటీ కారిడార్ లో ఈ ట్రాక్ ఏర్పాటు చేయడం వెనక వాక్ టూ వర్క్ కాన్సెప్ట్ తో ఇంటి నుంచి సైకిల్ పైనే ఆఫీస్ కు వెళ్లాలని ఈ ట్రాక్ అందుబాటులోకి తెచ్చామని అంటోంది హెచ్ఎండీఏ. సైక్లింగ్ అంటే ఇష్టపడే వాళ్లు, ఫిట్ నెస్ కోసం సైక్లింగ్ చేసే వాళ్లతో పాటు ఆఫీస్ లకు వెళ్లడానికి కూడా ఇది డబల్ యూజ్ కానుంది.సైకిల్ ట్రాక్ మార్గంలో ప్రతి కిలోమీటర్ దూరాన్ని సూచించేలా గుర్తులను ఏర్పాటు చేస్తున్నారు. మధ్యలో విశ్రాంతి తీసుకునేందుకు మీటింగ్ పాయింట్లు, ట్రాక్ కలరింగ్, భద్రతా పరమైన చిహ్నాలు, విద్యుద్దీపాలు, ఇతర భద్రతా పరమైన ఏర్పాట్లు ఉంటాయని, ప్రధానంగా సైకిల్ ట్రాక్‌పైకి ఇతర వాహనాలు రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నారు. దీని వల్ల ఎలాంటి ప్రమాదాలకు చోటు ఉండదన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లోనూ సైక్లింగ్ చేసేందుకు వీలుగా విద్యుత్ దీపాలతో వెలుతురు ఉండేలా ఏర్పాట్లు చేశారు.ఢిల్లీ కాలుష్యం, బెంగళూరు ట్రాఫిక్ వంటి పరిస్థితులను ఇతర నగరాలకు వేగంగా విస్తరిస్తున్న వేళా ఇలాంటి యాక్టివ్ మొబిలిటీ ప్రోత్సాహక కార్యక్రమాలు ఎంతో అవసరమని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు. నగరంలో పలు చోట్ల సైకిల్ ట్రాక్ లు ఉన్నా వాటిని ఉదయం 8 దాటింది అంటే వాహనాలు కబ్జా చేస్తున్నాయి. ఈ సోలార్ రూఫ్ సైకిల్ ట్రాక్ సపరేట్ గా ఉండటంతో అలాంటి ఇబ్బందులు ఉండవని? ప్రభుత్వ కృషికి సైక్లిస్టులు అభినందనలు తెలుపుతున్నారు.

# దూకుడు పెంచిన కాంగ్రెస్

**హైదరాబాద్, ఆగస్టు 16 :**

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పలు పార్టీలు తమదైన శైలిలో అడుగులు వేస్తున్నాయి. ఎవరికి వారు తమ పంథాన్ని నెగ్గించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఎలాగైన సరే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర పగ్గాలు చేపట్టేందుకు కీలక ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇక కాంగ్రెస్ పార్టీ కూడా వచ్చేది తమ ప్రభుత్వమే, గెలుపు తథ్యమంటూ ధీమా వ్యక్తం చేస్తోంది. ఇందుకోసం తమ కార్యాచరణ మొదలు పెట్టేసింది. ‘తిరగబడదాం.. తరిమికొడదాం.. అంటూ సరికొత్త నినాదంలో ఎన్నికలకు సిద్ధమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రజా కోర్టులు ఏర్పాటు చేసి ప్రజల్లోకి వెళ్లేందుకు రెడీ అవుతుంది. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వారి ప్రచారం కొనసాగనున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం తీరుపై ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ ప్రచారంలో భాగంగా ప్రజలను కూడా భాగస్వామం చేసే విధంగా ప్రయత్నాలు చేస్తోంది. ఇటీవల కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. కర్ణాటక తరహాలో రచించిన వ్యూహాన్ని తెలంగాణలో కూడా అనుసరించే విధంగా ప్లాన్ చేసుకుంటోంది. సోమవారం జరిగే స్క్రీనింగ్ కమిటీ భేటీలో కీలక అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఎలాగైనా సరే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసేలా తీవ్ర స్థాయిలో కృషి చేసేందుకు ప్రయత్నాలు ముమ్మం చేస్తోంది. అలాగే ఢిల్లీ అధిష్టానం సూచనల మేరకు ముందు వెళ్లేలా ప్లాన్ చేస్తోంది తెలంగాణ కాంగ్రెస్ పార్టీ. తెలంగాణలో పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరు కూడా కృషి చేయాలని, పార్టీని గెలిపించుకునేందుకు ఆ బాధ్యత ప్రతి ఒక్కరి భుజన వేసుకోవాలని ఢిల్లీ పెద్దలు సూచించినట్లు తెలుస్తోంది. గాంధీ భవన్‌లో జరిగే పీసీసీ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ సమావేశం స్క్రీనింగ్ కమిటీ ఛైర్మన్ మురళీధరన్ ఆధ్వర్యంలో జరగనుంది. ఈ సమావేశంలో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి సహా పలువురు సీనియర్లు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల కార్యాచరణపై స్క్రీనింగ్ కమిటీ చర్చించనుంది. ఈ మేరకు మురళీధరన్ హైదరాబాద్ చేరుకోగా.. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రేవంత్, ఉత్తమ్ ఆయనకు స్వాగతం పలికారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఎన్నికల రోడ్ మ్యాప్, కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించనున్నారు. ఈ సమావేశంలో పార్టీ చీఫ్ రేవంత్ రెడ్డితో పాటు భట్టి విక్రమార్క, సీనియర్ నేతలు పాల్గొనున్నారు.

# 6న వంగవీటి రాధా పెళ్లి

**విజయవాడ, ఆగస్టు 16**

వంగవీటి అనే పేరు తెలుగు రాష్ట్రాల్లో తెలియనివారు ఉండరంటే అతిశయోక్తి కాదు.. దానికి ప్రధాన కారణం వంగవీటి రంగా.. ఇక, ఆయన కుమారుడు వంగవీటి రాధా కృష్ణ కూడా రాజకీయాల్లో.. తన కమ్యూనిటీలో ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ముఖ్యంగా విజయవాడలో వంగవీటి ఫ్యామిలీకి పెద్ద ఎత్తున అనుచరులున్నారు.. అయితే, వంగవీటి ఫ్యామిలీని అభిమానించేవారికి, వంగవీటి రాధా కృష్ణ పెళ్లి ఎప్పుడెప్పుడా అంటూ ఎదురుచూస్తున్నవారికి శుభవార్త.. ఎందుకంటే.. వంగవీటి ఇంట పెళ్లి భాజాలు మోగనున్నాయి.. ఇప్పటికే రెండు కుటుంబాలు పెళ్లి ముహూర్తం కూడా ఫిక్స్ చేసుకున్నాయి..మొదట ఈ నెల 19వ తేదీన వంగవీటి రాధా-జక్కం పుష్పవల్లీల నిశ్చితార్థం ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు.. కానీ, పలు కారణాల వల్ల ఆ కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నట్టు తెలుస్తోంది.. పెళ్లి మాత్రం ముందుగా నిర్ణయించిన మూహూర్తానికి అంటే సెప్టెంబర్ 6న జరిపించనున్నారు.. వంగవీటి ఫ్యామిలీ అంటే రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం.. ఆ ఫ్యామిలీతో వియ్యం అందుకునేది ఎవరు? అనే చర్చ ఆసక్తికరంగా సాగుతుంది.. అయితే, వంగవీటి రాధాకు కాబోయే భార్య.. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని నరసాపురంకు చెందిన అమ్మాయి. నర్సాపురం పట్టణానికి చెందిన యువతితో రాధాకృష్ణకు వివాహం నిర్ణయించారు. తన మిత్రుడికి దగ్గర బంధువుల అమ్మాయితో ఈ వివాహం నిశ్చయం అయినట్లుగా తెలుస్తోంది. ఆమె ఎవరో కాదు.. నరసాపురం మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కం ఆమ్మాణి, బాబ్జీల చిన్నకుమార్తె జక్కం పుష్పవల్లీ.. ఇప్పటికే రెండు కుటుంబాలు పెళ్లి విషయంపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు.. ముహూర్తం కూడా ఫిక్స్ చేసుకున్నారని చెబుతున్నారు.మొదట నర్సాపురంలో ఈ నెల 19వ తేదీన వధువ ఇంట నిశ్చితార్థం నిర్వహించి.. సెప్టెంబర్ 6వ తేదీన విజయవాడలో పెళ్లి జరిపించాలనుకున్నారు.. కానీ, పలు కారణాలవల్ల రాధా నిశ్చితార్థం రద్దు చేసుకున్నారట.. సెప్టెంబర్ 6వ తేదీన నేరుగా వివాహానికి సిద్ధమయ్యారు.. బెజవాడలో వంగవీటి రాధా-పుష్పవల్లీ వివాహం ఘనంగా నిర్వహించాలన వంగవీటి ఫ్యామిలీ ఏర్పాట్లలో మునిగిపోయిందట.. ఇక, ఇటీవల ప్రధాన అనుచరులతో భేటీ కూడా ఇదే విషయం చెప్పటానికి ఓ సమావేశం ఏర్పాటు చేశారట వంగవీటి రాధా.. ఈ సమాచారం మీడియా వరకు వెళ్లడంతో.. సమావేశం రద్దు చేసి.. ఆత్మీయులకు మాత్రమే వివాహ విషయం తెలిపారట రాధా సన్నిహితులు. మొత్తంగా వంగవీటి ఇంట పెళ్లి భాజాలు మోగనున్నాయి. పార్టీలకు అతీతంగా వంగవీటి ఫ్యామిలీకి అభిమానులు ఉన్నారు.. వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు ఈ పెళ్లికి హాజరయ్యే అవకాశం లేకపోలేదు. నరసాపురానికి చెందిన జక్కం బాబ్జీ అమ్మాని దంపతుల చిన్న కుమార్తెనే వంగవీటి రాధా పెళ్లి చేసుకోబోతున్నారు. ఆమెకు సంబంధించిన వివరాలు తెలుసుకుందాం.. బాబ్జీ దంపతలుకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరి ద్వితీయ పుత్రిక పుష్పవల్లిని రాధాకు ఇచ్చి పెళ్లి చేయనున్నారు. జక్కం అమ్మాని 1987-92 వరకు నరసాపురం మున్సిపాలిటీ టిడిపి చైర్ పర్సన్‌గా బాధ్యతలు నిర్వహించారు. పుష్పవల్లి స్కూల్, కాలేజ్ విద్యాభ్యాసం అంతా నరసపురంలోనే జరిగింది. అనంతరం హైదరాబాద్‌లో ఉన్నత విద్యను అభ్యసించారు. కొంత కాలం హైదరాబాద్‌లో యోగా టీచరుగా చేసిన పుష్పవల్లి.. ఒక ప్రైవేట్ విద్యా సంస్థలో కీలక బాధ్యతలను చేపట్టారు.తండ్రి టిడిపి ఆవిర్భావం నుండి నరసాపురం రాజకీయాలలో కీలక పాత్ర పోషించేవారు. అయితే అనివార్య కారణాలవల్ల కొంతకాలం హైదరాబాద్‌కు మకాం మార్చారు. ఇటీవలి కాలంలో మళ్ళీ నరసాపురంలో నూతన గృహ నిర్మాణం చేసుకుని నివాసం ఉంటున్నారు. ఇటీవల ఈయన జనసేన పార్టీలో చేరి.. క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. పవన్ కళ్యాణ్ వారాహి యాత్రలో భాగంగా నరసాపురం వచ్చినప్పుడు వీరి ఇంట్లోనే బస చేశారు. ఇటీవల వంగవీటి రంగ జయంతి సందర్భంగా వంగవీటి రాధా వీరి నివాసానికి వచ్చి.. రంగా జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగానే రాధా మిత్రులు వివాహ సంబంధం గురించి ఇరువైపులా పెద్దలతో మాట్లాడినట్లు సమా చారం. ఈ నేపథ్యంలోనే వీరిద్దరి వివాహానికి ముహూర్తం ఖరారైంది. . అనివార్య కారణాల వల్ల ఎంగేజ్‌మెంట్ డేట్స్ సర్దుబాటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నా? నర్సాపురం అమ్మాయి? బెజవాడ అబ్బాయికి త్వరలోనే ఘనంగా పెళ్లి చేసేందుకు ఇరు పక్షాల పెద్దలు సమాయత్తమవుతున్నారు. నర్సాపురా నికి చెందిన జనసేన ఇన్‌ఛార్జ్ నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు సైతం రాధా నర్సాపురం పర్యటనలో పాల్గొని కుటుంబ సభ్యులతో జరిగిన చర్చల సందర్భంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# పోటీకి సిద్ధమంటున్న కాంగ్రెస్ ఎమ్మెల్సీలు

**హైదరాబాద్, ఆగస్టు 16:**


తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. గులాబీ నేత కేసీఆర్ ముందస్తు ప్రణాళికలు వేస్తున్నారు. రాజకీయాల్లో ఎత్తుగడలు వేయడం అంటే అది కేసీఆర్ కే సాధ్యమంటూ ఓ బ్రాండ్ ను ఏర్పర్చుకున్నారు. అయితే రానున్న ఎన్నికల నేపథ్యంలో సీఎం కేసీఆర్ తమ పార్టీ తరపున పోటీ చేయబోయే అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించనున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ మేరకు గులాబీ దళపతి కేసీఆర్ రంగంలోకి దింపే అభ్యర్థుల జాబితాను రెడీ చేసినట్లు బీఆర్ఎస్ వర్గాల ద్వారా సమాచారం. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ఎవరికి దక్కుతుందో.. ఎవరి ఆశలు నిరాశ అవుతుందనే ఉత్కంఠలో ఉన్నారు నేతలు. ఇప్పటికే చాలా మంది నేతలు తమకే టికెట్ ఇవ్వాలంటూ గులాబీ పెద్దలను ప్రసన్నం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఎవరి పైరవీలు వారివే ఉన్నాయి. కానీ బీఆర్ఎస్ పెద్దలను ఎంత ప్రసన్నం చేసుకున్నా చివరి నిమిషంలో ఏం జరుగుతుందోనని సందిగ్ధంలో ఉన్నారు నేతలు. అసెంబ్లీ ఎన్నికల పోటీకి ఎమ్మెల్సీలు కాగా, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎర్ కు చెందిన దాదాపు 13 మంది ఎమ్మెల్సీలు పోటీ పడుతున్నట్లు సమాచారం. ఇందులో కనీసం ఆరేడుగురు అభ్యర్థులు అసెంబ్లీ ఎన్నికల్లో చేయాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే మంత్రి కేటీఆర్ సన్నిహితులై ఎమ్మెల్సీలు జనగామ నుంచి పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, శంబీపూర్ రాజు, పల్లా రాజేశ్వర్ రెడ్డిలు రాబోయే ఎన్నికల్లో టికెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, మంత్రి సత్యవతి రాథోడ్ లు కూడా పోటీ చేయాలన్న పట్టుదలతో ఉన్నారు. ఇక ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి కల్వకుర్తి టికెట్ తనదేనని ఇప్పటికే ప్రచారం చేసుకుని నియోజకవర్గంలో సైతం పర్యటిస్తున్నారు. అలాగే మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తాండూర్ నుంచి పోటీ చేయాలని ఆశిస్తుండగా, కౌశిక్ రెడ్డి హుజురాబాద్ అసెంబ్లీ బరిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ప్రస్తుతం హోం శాఖ మంత్రి మహమూద్ అలీ ఈసారి ప్రత్యక్ష ఎన్నికల్లో బరిలో ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే నాంపల్లి, అంబర్ పేట, ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి ఆయన పేరును పరిశీలిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. నల్గొండ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ కోటిరెడ్డి నాగార్జున సాగర్ అసెంబ్లీ బరిలో దిగేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

## రేవంత్ రెడ్డి వ్యాఖ్యాలను ఖండించిన పోలీసు సంఘం

**కోమురం భీం ఆసిఫాబాద్ జిల్లా**

మహబూబ్ నగర్ సభ లో రేవంత్ రెడ్డి పోలీసుల గుడ్డలు ఉడా దిస్తా అని అనుచిత వ్యాఖ్యలను ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ సంఘం ఖండించింది.. శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల అదుపుతో ప్రజలకు నిరంతరం భరోసా కల్పిస్తున్న 'పోలీస్ శాఖ" " దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ పోలీసు. మహబూబ్ నగర్ సభలో టీపీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... రెడ్ డైరిలో మీ పోలీస్ పేర్లు రాసి పెడతాం 100 రోజులు తరువాత 'వచ్చినాక ఒకొక్కరిని గుడ్డలు ఇప్పదీయిస్తాం అని, పోలీసుల మనో భావాలు దెబ్బతినేలా మాట్లాడటం తగదని నిష్పక్షపాతంగా, చట్టాన్ని అనుసరిస్తూ విధి నిర్వహణ చేస్తున్న పోలీస్ లను దుర్భషలాడటాన్ని ఖండిస్తున్నామని సంఘం నేతలు అన్నారు.

## బావిలో పడి చిన్నారి మృతి



**రంగారెడ్డి**

రంగారెడ్డి జిల్లా నార్సింగి లో విషాదం జరిగింది.. ప్రమాదవశాత్తు ఆరేళ్ల బాలుడు బన్నీ బావి లో పడి మృతి చెందాడు. మంగళవాం సాయంత్రం కిరాణా కొట్టుకు వెళ్లిన బన్నీ, రాత్రి ఎంతకీ తిరిగి రాకపోవడంతో తో తల్లిదండ్రులు నార్సింగీ పోలీసులను ఆశ్రయించారు. పొలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసారు. ఓ పాడుబడ్డ బావిలో బాలుడి మృతదేహం గుర్తించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు నీళ్లు తోడేసి బాలుడి మృతదేహాన్ని బయటకు తీసారు.

## కోట్ల విజయభాస్కర్ రెడ్డి విగ్రహావిష్కరణ

**రాజేంద్రనగర్**

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం గండిపేట్ మండలం లోని చిత్రపురి కాలనీ లో దివంగత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కర్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని ఘనంగా కోట్ల విజయభాస్కర్ రెడ్డి విగ్రహావిష్కరణ జరిగంది. ఈ వేడుకల్లో పాల్గొన్న దర్శక నిర్మాతలు శ్యాంప్రసాద్ రెడ్డి, దిల్ రాజు, తమ్మారెడ్డి, సీ.కళ్యాణ్ తదితరులు పాల్గోన్నారు. చిత్రపురి కాలనీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో కోట్ల విజయభాస్కర్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి ఘనంగా నివాళి అర్పించిన దర్శక నిర్మాతల తో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గోన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కోట్ల విజయభాస్కర్ రెడ్డి చేసిన సేవలను స్మరించుకున్నారు.

## సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగుల ధర్నా

**హైదరాబాద్**

సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ... ఉద్యోగులు చేపట్టిన లకిడికపుల్ లోని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ర్యాలీగా వచ్చిన ఉద్యోగులు కార్యాలయం ముందు రోడ్డు పై బైఠాయించారు. మద్దతుగా వచ్చిన రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అర్. కృష్ణయ్య, పీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ ను అరెస్టు చేసేందుకు యత్నించడం తో ఉద్యోగులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బలవంతంగా పోలీసులు అరెస్ట్ చేయడంతో... పోలీసులకు, ఉద్యోగులకు తీవ్ర వాగ్వివాదం, తోపులాట జరగడంతో పరిసర ప్రాంతాలు ఉద్రిక్తంగా మారాయి. కొద్దిసేపు భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఉద్యోగ భద్రత కల్పించి... మినిమం టైమ్ స్కెల్ అమలు చేస్తూ... హెల్త్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## దళిత బందు కోసం మహిళల రాస్తారోకో

**బాసర**

నిర్మల్ జిల్లా బాసరలోని నిజామాబాద్ - బైంసా ప్రధాన రహదారిపై రైల్వే స్టేషన్ వద్ద కిర్గుల్ ( కె ) గ్రామానికి చెందిన మహిళలు నిరసన కు దిగారు. దళిత బంధు గ్రామంలో అందరికీ ఇప్పించాలని కోరుతూ రోడ్డుపై ధర్నా కు దిగారు.దాంతో ప్రధాన రహదారి పై భారీగా వాహనాలు నిలిచిపోయాయి.

## సెల్ ఫోన్ దుకాణంలో భారీ చోరీ

**వినుకొండ**

పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలో సెల్ షాపు లో అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. పట్టణంలోని ప్రధాన రహదారి అయిన లాయర్స్ స్ట్రీట్ లో భారీ చోరీకి పాల్పడ్డారు. కింగ్ మొబైల్ షాపులో సుమారు 25 లక్షల రూపాయల విలువైన సెల్ ఫోన్ లు చోరీ జరిగినట్లు షాపు యజమాని తెలిపారు. ప్రధాన రహదారి పైగా సిసి కెమెరాల పర్యవేక్షణ ఉన్నా సరే ఐ డోంట్ కేర్ అంటూ దొంగలు యదేచ్ఛగా షట్టర్ పగలగొట్టి సెల్ షాపులోకి చోరబడి చోరీ కి పాల్పడ్డారు.

# అందరికీ ఆదర్శం సాన రామకృష్ణారెడ్డి...

**రామగుండం మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ....**

**కమాన్ పూర్**



అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచే వ్యక్తి ప్రముఖ కాంట్రాక్టర్ సాన రామకృష్ణారెడ్డి అని రామగుండం మాజీ ఎమ్మెల్యే సోమారం సత్యనారాయణ అన్నారు. మంగళవారం కమాన్ పూర్ మండలంలోని ఆదర్శనగర్ లో రామకృష్ణారెడ్డి నివాసంలో 67వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూలపల్లి సర్పంచ్ బొల్లేపల్లి శంకర్ గౌడ్ కమాన్ పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైనాల రాజు కమాన్ పూర్ ప్రెస్ క్లబ్ సభ్యులు 8వ కాలనీ ప్రెస్ క్లబ్ సభ్యులు సదాశయ ఫౌండేషన్ సభ్యులు మరియు రామకృష్ణారెడ్డిని పలువురు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు సదాశయ ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ ప్లాస్టిక్ అనే భూతాన్ని తరమివేయాలని కోరారు. నేడు కాలుష్యం పెరిగిపోతుందని పేర్కొన్నారు. అవయవ దానానికి మరియు కళ్ళు దానానికి ముందుకు రావాలని కోరారు. అలాగే చేతి సంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సదా శయ ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రవణ్ కుమార్ లింగమూర్తి మాజీ కార్పొరేటర్ మారెల్లి రాజిరెడ్డి తోపాటు కిషన్ రెడ్డి నల్లవెల్లి శంకర్ నాచ గోని దశరథం బొజ్జ నరసింహ చారి అలాగే . మరియు అధ్యక్షులు రామకృష్ణరెడ్డి 67వ జన్మ దిన వేడుకలు ఉల్లాసంగా జరుపుకొా సదాశయ అధ్యక్షులు శ్రావణ్ కుమార్, కార్యదర్శి లింగమూర్తి, సలహా దారులు నూక రమేష్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు బిస్మాచారీ, చంద్రమౌళి, చందు,బత్తిని శంకర్, రాజిరెడ్డి, కవిత,రాజ మహేందర్ రెడ్డి అన్నపూర్ణ, ఎంపీటీసీ, సర్పంచ్, సాయి భక్తులు మల్లయ్య, లక్ష్మి నారాయణ,బాణయ్య కళాకారుల బృందం పాల్గొన్నారు.

# మృతునికి కుటుంబానికి చేయూతనిచ్చిన ఎంపీటీసీ

**కమాన్ పూర్**



కమాన్ పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బాపూజీ నగర్ కు చెందిన పురుషుల అంజి కుటుంబానికి కమాన్ పూర్ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బోనాల వెంకటస్వామి బియ్యం బస్తా తో పాటు ఆర్థిక సహాయాన్ని అందజేశారు .కమాన్ పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బాపూజీనగర్ కు చెందిన గోడిశెల అంజి వయసు దాదాపుగా 35 సంవత్సరాలు ఇటీవలే ప్రమాదషావత్తు రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలు విరిగి చాలా రోజులు నడవడానికి ఇబ్బంది పడుతూ మంచానికి పరిమితం కాగా, ఆ ప్రమాదం కారణంగా అనారోగ్యంతో వారం క్రితం మరణించిన సమాచారం తెలుసుకున్న కమాన్ పూర్ మండల ఎంపీటీసీ ఫోరమ్ అధ్యక్షులు బోనాల వెంకటస్వామి తమ వంతు సాయంగా సుందరం ఫౌండేషన్ సంస్థ తరుపున 25కిలోల బియ్యం మరియు వెయ్యి రూపాయల ఆర్థిక సాయం అందజేసి వారికి మేమున్నామనే భరోసా కల్పించి వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. బీద వారికి ఏ ఆపద వచ్చిన తమ సంస్థ ఎన్నో రకాలుగా ఇప్పటివరకు అన్ని విధాల సాయం చేసిందని ముందు ముందు ఇంకా తమకు సాధ్యమైన మేరకు సాయం చేస్తూనే ఉంటామని బోనాల వెంకటస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ టౌన్ ప్రెసిడెంట్ నీలిరాజయ్య, ఇనగంటి ప్రభాకర్ రావు, బోనాల సత్యనారాయణ, చిప్పకుర్తి అరవింద్, చిప్పకుర్తి అరుణ్, గోడిశెల స్వామి, మాజీ వార్డ్ మెంబెర్ గోడిశెల లింగస్వామి, దాసు, గెల్లు లింగయ్య, చెన్నోజు చంద్రశేఖర్, మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఎన్నికల నగారా మ్రోగించిన ఎమ్మెల్సీ కవిత

**నిజామాబాద్**



నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని బూతు స్థాయి కార్యకర్తల మీటింగ్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత ఎన్నికల నగారా మ్రోగించారు. బోధన్ పట్టణంలో ఐదు కిలోమీటర్ల వరకు పాదయాత్ర నిర్వహించారు ఈ సందర్భంగా కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం కార్యకర్తల స్థాయి మీటింగ్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోధన్ ఎమ్మెల్యే షకీల్ మాట్లాడుతూ బోధన్ పట్టణంలో, నియోజకవర్గంలో ఇప్పటివరకు కోట్ల రూపాయల అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. దాదాపు 1800 కోట్ల రూపాయలు ప్రజల ఖాతాలలోకి వెళ్లాయని తెలిపారు. టిఆర్ఎస్ పాలనలో ప్రతి ఇంటికి అభివృద్ధి ఫలాలు అందాయన్నారు. మత రాజకీయాలు చేసే అలవాటు మాకు లేదు అని అన్నారు. అన్ని కులాలను అన్ని మతాలను కలుపుకొని పోతామని అన్నారు. ఒక్క బోధన్ పట్టణంలోని పదివేల మంది బీడీ కార్మికులకు పెన్షన్లు ఇచ్చామని అన్నారు. పని చేసి చూపిస్తామని అబద్ధాలు చెప్పే అలవాటు మాకు లేదని అన్నారు. తెలంగాణ వచ్చాక 158 చెరువులను అభివృద్ధి చేసుకున్నామని అన్నారు. బోధనలో సీనియారిటీకి సిన్సియారిటీకి మధ్యల పోటీ ఉందన్నారు సీనియార్టీ కావాలో సిన్సియారిటీ కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని అన్నారు. బోధనలో 4500 మహిళా గ్రూపులు ఉన్నాయని వారందరికీ 4600 కోట్ల రూపాయలు నిధులు ఇచ్చామన్నారు. అతి త్వరలో గడపగడపకు బిఆర్ఎస్ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. భారతదేశ చరిత్రలోనే ఒక్క తెలంగాణ రాష్ట్రంలోని 1,30,000 ఉద్యోగాలు ఇచ్చామన్నారు. నిజామాబాదులో ఇటీవల ప్రారంభించిన ఒక్క ఐటీ హబ్ లోని 250 ఉద్యోగాలు ఇచ్చామన అన్నారు. టిఆర్ఎస్ అంటే మన ఇంటి పార్టీ. మనది పేగు బంధం వాళ్లది ఓటు బంధం. రైతులకు ఈ లక్ష రూపాయల రుణమాఫీ అందించాము. రాష్ట్రవ్యాప్తంగా 35 లక్షల మందికి రుణమాఫీ చేశాము. నేను తెలంగాణ ప్రజలకు ఒకటే చెప్తున్నాను ఆలోచించండి ఆశీర్వదించండి. ఈ కార్యక్రమంలో బోధన్ నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీ ఎంపిటిసిలు జెడ్పిటిసిలు సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాముల జైపాల్ రెడ్డి సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐదవ రోజు పాదయాత్ర

**సూర్యాపేట**



సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం లోని జైపాల్ రెడ్డి సేవ ఫౌండేషన్ నాలుగో రోజు పాదయాత్ర చిలుకూరు మండల ంలోని జెర్రిపోతుల గూడెం, బేతావోలు, చిలుకూరు గ్రామంలో పాదయాత్ర చేయడం జరిగింది. ఫౌండేషన్ చైర్మన్ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, ఈ పాద యాత్రలో ప్రజల యొక్క సమస్యలు వారి జీవనశైలి ఇది విధానాలు తెలుస్తున్నాయని, వారికి మా ఫౌండేషన్ తరపున సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. చిలుకూరు గ్రామంలో హోటల్ యజమాని తో మమేకమై వారి స్థితి గతులను తెలుసుకొని స్వయంగా బజ్జీలు తయారు చేశారు. ఈరోజు ఐదవరోజు అనంతగిరి మండలంలోని అనంతగిరి, మొగల్యకోట, లకారం, శాంతినగర్ గ్రామాల్లో పర్యటించారు. ప్రజలు ఎంతో ఆత్మీయతతో ఆదరిస్తున్నారని తెలియజేశారు. రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తనకు టిక్కెట్ ఇస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## వివాదంలో ఎక్సైజ్ శాఖ ఫ్లెక్సీ




**సంగారెడ్డి**

మద్యం దుకాణాలకు టెండర్ వేయడానికి వస్తున్న దరఖాస్తుదారులకు ఎక్సైజ్ శాఖ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదాస్పదమైంది. మద్య నిషేధ శాఖ కాస్తా.. మద్య ప్రోత్సహక శాఖగా మారిందంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆ ఫ్లెక్సీని తొలగించింది ఎక్సైజ్ శాఖ. సంగారెడ్డి జిల్లాలో 101 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటికి టెండర్లు వేయడానికి ఈనెల 18 ఆఖరి తేదీ. ఒక్కో దుకాణానికి కనీసం గా 20 దరఖాస్తు రావాల్సి ఉంది. దీంతో ఎక్సైజ్ అధికారులు టెండర్లను వేయాల్సిందిగా వ్యాపారస్తులను కోరుతున్నారు. ఫోన్లు చేసి మరీ రిక్వెస్ట్ చేస్తున్నారట. కాస్త శృతి మించి సంగారెడ్డిలో మద్యం దుకాణాలకు టెండర్లు వేయడానికి వస్తున్నవారికి స్వాగతం సుస్వాగతం అంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. మద్యం నిషేధం శాఖ ఇలా ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంపై విమర్శలు రావడంతో వెంటనే తొలగించారు ఎక్సైజ్ అధికారులు.

## కేయూ లెక్చరర్ల అందోళన

**హన్మకొండ**

హన్మకొండ జిల్లా కాకతీయ యూనివర్సిటీలో కాంట్రాక్టు లెక్చరర్స్ ను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ లెక్చరర్లు తరగతి గదులు బహిష్కరించారు. విద్యార్థులతో కల్సి ఆందోళన చేపట్టారు.రాష్ట్ర వ్యాప్తంగా 1475మందిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేసారు. గత 100 రోజులుగా తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేసినా, పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం. తమను రెగ్యులరైజ్ చేయకుంటే.. ఈ నెల 19న ఇంద్ర పార్క్ వద్ద 48గంటల సమ్మె, నిరాహార దీక్ష పడతాం అంటూ హెచ్చరించారు.

## పోలీసుల అదుపులో అంతర్ జిల్లా సైబర్ ఛీటర్లు

**కడప**

కడప జిల్లా పోలీసులు అంతర్ జిల్లా సైబర్ మోసగాళ్లు అరెస్ట్ చేసారు. జిల్లా ఎస్పీ అన్బురాజన్ కేసు వివరాలు వెల్లడించారు. బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బు కొట్టేస్తున్న ప్రకాశం, గుంటూరు జిల్లాలకు చెందిన ఐదుగురు సైబర్ మోసగాళ్లను అరెస్టు చేసాం. నిందితుల నుంచి నకిలీ వేలిముద్రలు తయారుచేసే సామాగ్రి స్వాధీనం చేసుకున్నాం. ఆధార్ ఎనేబుల్డ్ సిస్టం ద్వారా వినియోగదారుల ఖాతాల నుంచి డబ్బు స్వాహా చేస్తున్నారు. వినియోగదారుల నకిలీ వేలి ముద్రల సేకరణ ద్వారా లక్షల రూపాయలు కొట్టేసారని అయన అన్నారు.

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖతో పాటు ఇతర వెబ్సైట్ ద్వారా డాక్యుమెంట్లను సేకరించి వాటిలోని వేలిముద్రలను నకిలీవిగా ముఠా తయారు చేస్తుంది. బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బు మాయమవుతుండటం పై వినియోగదారుల పిర్యాదులు పై దర్యాప్తు చేసాం. ఎన్సీఆర్పీ పోర్టల్ ద్వారా బ్యాంక్ ఖాతాల నుంచి ముద్దాయిలు డబ్బు కొట్టేసారు. ముద్దాయిలపై ఇప్పటికే నాలుగు ఎఫ్ఐఆర్లు, 412 ఎన్సీఆర్పి పిటిషన్లు నమోదు అయ్యాయి. ముద్దాయిల 12 అకౌంట్లను సీజ్ చేసి ఈడీకి పంపనున్నాం. ముద్దాయిలు వినియోగించిన సమాచార వెబ్సైట్ల మూసివేతకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు సాగించినచో కట్టిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ అన్నారు.

## సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా ను పరామర్శించిన రాష్ట్ర మంత్రి జోగి రమేష్

**విజయవాడ**

కొండపల్లి షాబుఖారీ నిత్య అన్నదాన లంగర్ ఖానా నిర్వాహకులు సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా తండ్రి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్ ఖాదర్ జిలాని ఇటీవల మరణించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ బుధవారం నాడు జిలాని కుమారులు అల్తాఫ్ రజా మరియు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. జిలానితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. జిలాని కుమారులు న్యాయవాది ముక్తార్, ఫారుక్ లను ఆప్యాయంగా పలకరించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపాలిటీ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాంధీ సినిమా చూసిన కలెక్టర్

**ఖమ్మం**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఖమ్మం నగరంలోని సినిమా థియేటర్లలో విద్యార్థుల కోసం గాంధీ చిత్రం ప్రదర్శించారు. ఖమ్మం నగరంలోని సాయిరాం థియేటర్లో విద్యార్థులతో కలిసి కలెక్టర్ గౌతమ్ , సి.పి విష్ణు ఏస్ వారియర్ గాంధీ సినిమా ను చూసారు. స్వతంత్ర దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా గాంధీ సినిమా ను ప్రదర్శిస్తున్నారు. ప్రతి ఒక్క విద్యార్థి కూడా గాంధీ సినిమా చూడాలని కలెక్టర్ కోరారు.

## అనంతగిరిలో రెచ్చిపోతున్న ఆకతాయిలు

**వికారాబాద్**

వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి పర్యాటక ప్రాంతంలో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కలుషితం చేస్తు అంతా మా ఇష్టం.. మమ్మల్ని అడిగేది ఎవరు అన్న చందంగా మద్యం తాగుతాం ఇష్టారాజ్యంగావ్యవహరిస్తున్నారు. తెలంగాణ ఊటీగా పిలవబడే అనంతగిరి అటవీ ప్రాంతానికి వారాంతపు సెలవుల్లో వేల సంఖ్యలో అనంతగిరి కి కుటుంబ సమేతంగా పుణ్యక్షేత్రాన్ని దర్శించుకుని అనంతరం అడవి అందాలని చూస్తూ ఆహ్లాదంగా గడుపుతారు. అయితే ప్రస్తుత పరిస్థితి పరిశీలిస్తే కొందరు టూరిజం పేరుతో అనంతగిరి కి వచ్చి దర్జాగా మద్యం వెంట తెచ్చుకొని విచ్చలవిడిగా తాగుతూ బైక్లు,కార్లతో స్టంట్ లు చేస్తూ వాతావరణాన్ని కలుషితం చేయడమే గాక ఇతర పర్యాటకులకు ఇబ్బందికలిగిస్తున్నారు. వీళ్ళ ధీమా విషయానికొస్తే ఫారెస్ట్ లోకి ప్రవేశించినప్పుడు అటవీశాఖ అధికారులకు 20 రూపాయలు చెల్లిస్తే చాలు ఇక మేము ఏం చేసినా చెల్లుతుందని విర్రవీగుతున్నారు. ఇక అడవి శాఖ అధికారులేమో అనంతగిరి అభివృద్ధి పేరు చెబుతూ కాలం గడుపుతూ వచ్చిన వారి జేబులకు చిల్లులు పెడుతూ డబ్బులు తీసుకుని వచ్చిన వారిని పరిస్థితులు దాపురించడం దౌర్భాగ్యం. ఇంత జరుగుతున్నా అడిగే నాధుడే లేడు. తాజాగా మంగళవారం పెద్ద ఎత్తున యువకులు బైకులు కార్లతో నానా హంగామా సృష్టించారు. వారి హంగామా చూసిన పర్యాటకులు స్థానికులు హాడలెత్తిపోయారు. ఇంత జరుగుతున్న ఫారెస్ట్ అధికారులు ఏం చేస్తున్నట్టు అని ప్రజలు మండిపడుతున్నారు.

## నిర్మల్ మున్సిపల్ మాస్టర్ ప్లాన్ రగడ

**అదిలాబాద్, ఆగస్టు 16**

నిర్మల్ జిల్లాలో నిర్మల్ మున్సిపల్ మాస్టర్ ప్లాన్ రాజకీయ వివాదానికి దారి తీస్తోంది. ఇటీవల నిర్మల్ పట్టణంలో కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకటించారు. అయితే ఈ మాస్టర్ ప్లాన్‌లో భారీ అవినీతి జరిగిందని ఇతర పార్టీల నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఉద్యమాలు ప్రారంభించారు గ్రీన్ జోన్ లో ఉన్న పంట పొలాలను ఇండస్ట్రియల్ జోన్ లోకి మార్చి రైతులను మోసం చేస్తున్నారని విపక్ష నేతలు అంటున్నారు. అలాగే ఇండస్ట్రియల్ జోన్ లో ఉన్న సోఫినగర్ ప్రాంతాన్ని కమర్షియల్ రెసిడెన్షియల్ జోన్ గా మార్చారని.. అక్కడ అధికార పార్టీ నేతలు ముందు కొన్న భూముల విలువలు అమాంతం పెంచుకొని కార్పొరేట్ సంస్థలకు అమ్ముకుంటున్నారని ఆరోపిస్తున్నారు. మాస్టర్ ప్లాన్ తో నిర్మల్ పట్టణ ప్రజలను నిండా ముంచుతున్నారని ..తమ ఆస్తుల విలువను బీఆర్ఎస్ నేతలు పెంచుకుంటున్నారని విపక్ష పార్టీలు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నాయి. ఇండస్ట్రియల్ జోన్ లో ఉన్న భూములను తక్కువ ధరలకు కొనుగోలు చేసి మాస్టర్ ప్లాన్ లో ఆ భూములను కమర్షియల్ రెసిడెన్షియల్ జోన్ గా మార్చి భారీ స్కాంకు తెరలేపారంటున్నారు. ఇండస్ట్రియల్ జోన్ ను కమర్షియల్ రెసిడెన్షియల్ జోన్ గా మార్చాలంటే వాటికి కొన్ని పరిమితులు, కొన్ని నియమ నిబంధనలు ఉంటాయని, వాటన్నింటినీ తుంగలో తొక్కి ప్రభుత్వంలో అధికారంలో ఉన్న పెద్దలే భారీ కుంభకోణానికి పాల్పడ్డారని విమర్శలు గుప్పిస్తున్నారు. కొద్ది రోజులుగా నిర్మల్ ఆర్డీవో ఆఫీస్ ఎదుటగా ధర్నాలు జరుగుతున్నాయి. బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. గతంలో ఇచ్చిన మాస్టర్ ప్లాన్‌కు పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో ఆ మాస్టర్ ప్లాన్ ను రద్దు చేస్తున్నామని ప్రకటించిన మంత్రి తిరిగి అదే తరహా లో కొత్త మాస్టర్ ప్లాన్?ను రూపొందించడం సరికాదని మహేశ్వర్ రెడ్డి అంటున్నారు. గ్రీన్ జోన్‌లో చెరువులు, పంట పొలాలు, చెట్లు ఉన్నప్ప టికీ వాటిని పూర్తిగా ఇండస్ట్రియల్ జోన్ పరిధిలోకి తేవడం తో రైతులకు నష్టం జరుగుతోందని అంటున్నారు. ఈ మాస్టర్ ప్లాన్ ను రద్దు చేయాలని అంటున్నారు. దాదాపుగా ప్రతీ రోజూ నిర్మల్ మాస్టర్ ప్లాన్ కు వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ విషయంపై అధికారులు.. ప్రజల అనుమానాలకు పూర్తి స్థాయిలో సమాధానాలు ఇవ్వలేకపోతూండటంతో అనుమానాలు పెరిగిపోతున్నాయి. దీంతో రోడ్డెక్కేవారు పెరిగిపోతున్నారు. గతంలో కామారెడ్డి మాస్టర్ ప్లాన్ అంశం తీవ్ర దుమారం రేపడంతో.. రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ సంచలనం అయింది. నిర్మల్ కూడా అదే తరహాలో ఉండటంతో.. సమస్యను పరిష్కరించేందుకు బీఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారు.

## సెమీస్ కోసం కమలం కసరత్తు

**న్యూఢిల్లీ, ఆగస్టు 16**

ఈ ఏడాది చివర్లో జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ ఇప్పటి నుంచే కసరత్తు మొదలుపెట్టింది. అభ్యర్థుల ఎంపిక, విధివిధానాలపై తుది నిర్ణయం తీసుకునే బీజేపీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ ఢిల్లీలో సమావేశ మైంది. సాధారణంగా ఈ కమిటీ ఎన్నికల తేదీ ప్రకటించిన తర్వాత సమావేశమై అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. కాని, ఈసారి ఎన్నికలకు సంబంధించి ఎటువంటి ప్రకటన రాకముందే ఈ కమిటీ సమావేశమవ్వడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇలా ముందస్తుగా సమావేశం కావడం బహుశా ఇదే మొదటిసారి. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీఈసీలో సభ్యులైన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఇతర సభ్యులందరూ పాల్గొంటారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు వీడీ శర్మ, ఛత్తీస్‌గఢ్ బీజేపీ అధ్యక్షుడు అరుణ్ సావో ఆ రాష్ట్రానికి చెందిన ఇతర కీలక నేతలు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. సీఈసీలో మొత్తం 15 మంది సభ్యులున్నారుబలహీనంగా ఉన్న స్థానాలు గుర్తించడం, అక్కడ బలమైన అభ్యర్థులను నిలపడం వంటి కీలక అంశాలపై సీఈసీలో మేధోమధనం జరుగుతుందని బీజేపీ వర్గాలు తెలిపాయి. అధిక దృష్టి పెట్టాల్సిన స్థానాలను ఇప్పటికే బీజేపీ నాయకత్వం గుర్తించినట్లు సమాచారం. మధ్యప్రదేస్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌కు సంబంధించిన కొన్ని స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసే అవకాశం కనిపిస్తోంది. ఎన్నికలకు సంబంధించిన ప్రచార వ్యూహం, అభ్యర్థుల ఎంపిక అంతా ఈ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ కనుసన్నల్లోనే జరుగుతుంది. ఈ ఏడాది చివరిలోపు అంటే నవంబర్-డిసెంబర్‌లో ఐదు రాష్ట్రాలు ? రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మిజోరం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నా?యి. ఈ ఐదు రాష్ట్రాల్లో కేవలం మధ్యప్రదేశ్‌లో మాత్రమే బీజేపీ అధికారంలో ఉంది. మిజోరంలో మిత్ర పక్షం మిజో నేషనల్ ఫ్రంట్ ఎంఎన్ఎఫ్ అధికారంలో ఉన్నా మణిపూర్ సంక్షోభం తర్వాత ఆ పార్టీతో బీజేపీ సంబంధాలు కొంత దెబ్బతిన్నాయి. వచ్చే ఏడాది ఏప్రిల్-మేలో జరిగే లోక్‌సభ ఎన్నికలకు ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికలు సెమిఫైనల్‌గా రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి.

## డబుల్ బెడ్ రూం ఇళ్లు పంపిణీకి సిద్ధం

**హైదరాబాద్, ఆగస్టు 16**

జిహెచ్ఎంసి నగర పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్ ఇండ్ల పంపిణీ ప్రక్రియపైన పురపాలక శాఖ మంత్రి కే తారక రామారావు ఈరోజు ప్రగతి భవన్ లో ఒక ఉన్నత స్థాయి సమిక్ష సమావేశాన్ని నిర్వహించారు. హెచ్ఎంసీ పరిరు. వరికి డబుల్ బెడ్ రూమ్ పంపిణీపై న్యాయంగా వ్యవహరించాలని అధికారులను సూచించారు. అన్యాయం జరగకుండా ప్రతి పేదవాడికి డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ న్యాయపరంగా జరగాలని అన్నారు. ఇళ్ల నిర్మాణం కూడా త్అందుకు భిన్నంగా బీఆర్ ఎస్ ప్రభుత్వం పేదల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు రెండు పడక గదులతో కూడిన ఇళ్లను నిర్మించి ఉచితంగా అందజేస్తోంది. దీన్ని ప్రభుత్వం నిర్విరామ ప్రక్రియగా కొనసాగిస్తోందన్నారు. హైదరాబాద్ నగరంలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న లక్ష డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులైన పేదలకు నేటి నుంచి ప్రభుత్వం అందజేస్తోంది. సొంత భూమి ఉండి ఇల్లు కట్టుకోలేని పేదల కోసం ప్రభుత్వం గృహలక్ష్మి అనే పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద మూడు దశల్లో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులకు మూడు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందజేస్తారు. ముందుగా ఒక్కో నియోజకవర్గంలో 3 వేల మందికి లబ్ధి చేకూరుతుంది. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి వికలాంగులకు గృహలక్ష్మి పథకంలో ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించిందని కేసీఆర్ అన్నారు.స్వాతంత్ర దినోత్సవ ప్రసంగంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రకటన నేపథ్యంలో పంపిణీ ప్రక్రియను జిహెచ్ఎంసి మరింత వేగవంతం చేసింది. జిహెచ్ఎంసి పరిధిలోని నగర మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, మల్లారెడ్డి , డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ లు హాజరైన ఈ సమావేశానికి జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఇప్పటికే 70వేల ఇండ్లు నిర్మాణం పూర్తిచేసుకుని పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, అర్హులైన లబ్ధిదారులకు అందించే కార్యక్రమం వేగంగా నడుస్తుందని అధికారులు ఈ సమిక్ష సమావేశంలో మంత్రులకు తెలియజేశారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వెరిఫికేషన్ పక్రియ కూడా దాదాపు పూర్తి కావచ్చిందని తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం జిహెచ్ఎంసిలో లక్ష ఇండ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకొని వాటిని వేగంగా పూర్తి చేస్తుందని, ఇప్పటికే 75 వేలకు పైగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తి అయిందని పురపాలక శాఖ మంత్రి తారక రామారావు తెలిపారు. ఇందులో సుమారు 4500 కు పైగా ఇండ్లను ఇన్ సిట్యూ లబ్ధిదారులకు అందించామని తెలిపారు. నిర్మాణం పూర్తి చేసుకొని పంపిణీకి సిద్ధంగా ఉన్న సూమారు 70 వేల ఇండ్లను 5 లేదా 6 దశల్లో వేగంగా అందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. వచ్చే వారంలోనే తొలి దశ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభమవుతుందదన్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తిచేయాలని జిహెచ్ఎంసి అధికారులకు మంత్రి కేటీఆర్ ఆదేశాలు జారీ చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రక్రియ పంపిణీ పైన మంత్రులు పలు సూచనలను తెలియజేశారు.డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీకి సంబంధించి నగర ప్రజలు ఎంతో ఆత్రుతతో ఎదురుచూస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారుల గుర్తింపులో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదని పూర్తిగా అధికార యంత్రాంగమే క్షేత్రస్థాయి పరిశీలన కూడా పూర్తిచేసి అర్హులను గుర్తిస్తున్నదని మంత్రులు తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం గుర్తించిన లబ్ధిదారులందరినీ వాటి కేటాయించనున్న ఇండ్ల వద్దనే అప్పజెప్పేలా పంపిణీ కార్యక్రమం ఉండాలని ఈ సందర్భంగా మంత్రులు సూచించారు. గృహలక్ష్మి పథకానికి సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక, పథకాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకువెళ్లే విషయాన్ని కూడా మంత్రుల సమావేశంలో చర్చించారు.

## తాగునీటికే నీరు... సాగేదెలా



**హైదరాబాద్, ఆగస్టు 16**

నదిలో నీటి ప్రవాహం లేక కృష్ణమ్మ వెలవెలబోతోంది. పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు లేకపోవడంతో.. నదిలో నీటి ప్రవాహం లేదు. మరో నాలుగైదు రోజులు వానలు కురిసే అవకాశాలు లేవని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించడంతో.. రానున్న రోజుల్లో ఎలాంటి పరిస్థితి ఉంటుందోనని ఆందోళన వ్యక్తం అవుతోంది. తాగు, సాగునీటిపరంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లకు అత్యంత కీలకమైన నాగార్జున సాగర్ ప్రమాద ఘంటికలు మోగిస్తోంది.రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కు సాగరే తాగునీటికి ప్రధాన వనరు కావడంతో, సాగర్ లో నీరు లేకపోవడం కొంత ఆందోళన కలిగిస్తోంది. సాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని తీసుకునేందుకు కనీస నీటిమట్టం 510 అడుగులు కాగా.. ప్రస్తుతం ఈ జలాశయంలో 518 అడుగుల వద్ద నీటి నిల్వ ఉంది. సాగర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 145.83 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు శ్రీశైలం నుంచి 32 టీఎంసీలు రావడంతో ఈ మాత్రం నిల్వ ఉంది. లేదంటే పరిస్థితి మరింత దారణంగా ఉండేదని అధికారులు అంటున్నారు. సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులకు.. గత సంవత్సరం ఈ రోజుకు 584.90 అడుగుల స్థాయిలో నీరు ఉండేది. అంటే 297.15 టీఎంసీల నీరు ఉంది. కర్ణాటకలో మొన్నటి వరకు ఓ మోస్తరు వానలు కురిశాయి. దాంతో ఆలమట్టి నుంచి నారాయణపూర్ కు 98.90 టీఎంసీలను విడుదల చేశారు. నారాయణపూర్ నుంచి జూరాల జలాశయానికి 100 టీఎంసీల నీరు వచ్చింది. జూరాలతో పాటు తుంగభద్ర పరీవాహకం నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు 100.77 టీఎంసీలు మాత్రమే వచ్చాయి. శ్రీశైలం జలాశయంలో మంగళవారం నాటికి 885 అడుగులకు గాను 862.90 అడుగుల నీటిమట్టం ఉంది. శ్రీశైలం పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలకు 115 టీఎంసీల నీరు ఉంది. తుంగభద్ర ప్రాజెక్టు నిండేందుకు చేరువ కావడం ప్రస్తుతం కొంతలో కొంత ఊరట కలిగిస్తోంది. ఈ నదీ పరీవాహకంలో వర్షాలు కురిస్తే ఇక దిగువకు నీటిని విడుదల చేస్తారు. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి సామర్థ్యానికి చేరుకోవడానికి మరో 100 టీఎంసీల నీరు రావాల్సి ఉంది. శ్రీశైలం ప్రాజెక్టు ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రం నుంచి తెలంగాణ రాష్ట్ర సర్కారు విద్యుత్ ను ఉత్పత్తి చేస్తోంది. దీని వల్ల రోజు? 12 వేల నుంచి 27 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం నాగార్జున సాగర్ జలాశయం వైపు వెళ్తోంది. ఆంధ్రప్రదేశ్ వైపు 14 వేల క్యూసెక్కులను కాల్వలకు వదులుతున్నారు. కృష్ణా నదిపై ఉన్న ప్రధాన జలాశయాలైన శ్రీశైలం, నాగార్జున సాగర్ లు రెండూ కలిపి మొత్తంగా 267 టీఎంసీల మేర ఖాళీ ఉందని అధికారులు చెబుతున్నారు.

## పోలీసుల అదుపులో క్యూ నెట్ ఉపేంద్రనాధ్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 16**

ఒకప్పుడు స్వప్నలోక్ కాంప్లెక్స్ అనగానే అక్కడ రద్దీ షాపింగ్.. ఉద్యోగుల హడావుడి.. పండుగలు వస్తే చాలు కళకళలాడుతూ కనిపించేది. కానీ ఇప్పుడు స్వప్నలోక్ కాంప్లెక్స్ అనగానే ఇటీవల జరిగినటువంటి భారీ అగ్నిప్రమాదమే గుర్తువస్తుంది. ఈ అగ్ని ప్రమాదంలో ఆరుగురు యువతీయువకులు చనిపోయిన విషయం తెలిసిందే. అయితే, ఈ ఘటన తర్వాత అతిపెద్ద భారీ మోసం తెర మీదకు వచ్చింది. అదే క్యూనెట్ మల్టీ మార్కెటింగ్ మోసాలు.. సంచలనంగా మారినటువంటి ఈ కేసులో తల్లిదండ్రులు తమ బిడ్డలను పోగొట్టుకున్నదే కాక.. భవిష్యత్తుపై ఎన్నో కలలు కంటున్న వాళ్ళ ఆశలు సైతం కాలి బూడిదయ్యాయి. తమ బిడ్డల భవిష్యత్తు కోసం దాచుకున్న డబ్బును పంట పొలాలను అమ్మి మరి.. యూనిట్ మల్టీ లెవెల్ మార్కెటింగ్ లో పెట్టారు. కానీ అది మోసం అని గమనించి బాధితులు నరకయాతన అనుభవించారు. అటు కుటుంబ సభ్యులకు చెప్పుకోలేక ఇటు డబ్బులు రాక ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో జరిగిన ఈ అగ్ని ప్రమాదం తర్వాత ఈ మోసానికి సంబంధించి అసలు బండారం బయటపడింది. హైదరాబాద్ నగరాన్ని కేంద్రంగా చేసుకొని చైన్ లింకింగ్ మోసాలకు పాల్పడిన క్యూనెట్ కేసులో కీలక నిందితుడు ఉపేంద్ర నాథ్ రెడ్డిని హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. మూడు నెలల పాటు అజ్ఞాతంలో ఉన్న ఉపేంద్ర నాథ్ రెడ్డి బెంగళూరులో తలదాచుకున్నట్లు పక్కా సమాచారం అందింది. దీంతో నగర సిసిఎస్ పోలీసులు బెంగళూరుకు వెళ్లారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. స్థానికంగా ఉన్నటువంటి న్యాయస్థానంలో హాజరు పరిచి అనంతరం హైదరాబాద్ తీసుకువచ్చారు.2017లో తెలంగాణ ప్రభుత్వం మల్టీ మార్కెటింగ్ పై నిషేధం విధించడంతో క్యూనెట్ కార్యకలాపాలు నిలిపివేసింది. కర్ణాటకకు చెందిన రాజేష్ కన్నా ఏపీలోని కర్నూలు జిల్లా చిన్నమ్మ పల్లి గ్రామ వాసి అయినటువంటి ఉపేంద్రనాథరెడ్డి తో పాటుగా మరికొందరు కలిసి పేరు మార్చి విహాన్ డైరెక్టర్ సెల్లింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అని మల్టీ లెవెల్ మార్కెటింగ్ వ్యాపారాన్ని ప్రారంభించారు. గుట్టుగా ఈ వ్యాపారాన్ని సాగించారు. అయితే, సికింద్రాబాద్ స్వప్నలో కాంప్లెక్స్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరుగురు యువతి యువకులు మరణించిన అనంతరం ఈ మల్టీ మార్కెటింగ్ వ్యవహారం అంతా బయటకు వచ్చింది. ఈ కామర్స్ వ్యాపారంలో పెట్టుబడితో ప్రతి నెల 20వేల నుంచి 60 వేల వరకు సంపాదించవచ్చు అంటూ అమాయకపు నిరుద్యోగ యువతను నిందితులు నమ్మించారు. అనంతరం వందలాది మంది నిరుద్యోగ యువత నుంచి లక్షల రూపాయలను వసూలు చేశారు.ఇలా రాష్ట్రంలో 163 మంది బాధితుల నుంచి ఏకంగా మూడు కోట్ల రూపాయలు వసూలు చేశారు. మొదటగా లాభాల ఆశ చూపించిన ఉపేంద్ర నాథ్ రెడ్డి.. ఆ తర్వాత లాభాలను ఇవ్వకుండా ముఖం చాటేస్తూ ఉండడంతో బాధితులు పలుమార్లు నిలదీశారు. కొత్తగా సభ్యులను చేర్పిస్తే డబ్బు తిరిగి ఇస్తామంటూ మెలిక పెట్టి మరికొంతమంది నిరుద్యోగ యువతను ఉద్యోగులుగా మార్చుకున్నారు. అయితే, స్వప్నలోక్ కాంప్లెక్స్ లో అగ్నిప్రమాదం తర్వాత మరణించిన వారి కుటుంబ సభ్యులు ఈ యూనిట్ మోసాల గురించి బయటపెట్టారు. ఈ ఘటనపై మహంకాళి పోలీసులు నాలుగు కేసులు నమోదు చేశారు. అనంతరం కోట్ల రూపాయల వరకు మోసం జరిగిందని నిర్ధారించి ఈ కేసును సిసిఎస్ కు బదిలీ చేశారు. స్వయంగా ఈ కేసును హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ పర్యవేక్షించారు. ఇప్పటికే ఈ కేసులో 15 మంది నిందితులను గుర్తించారు. గతంలో ఎనిమిది మందిని అరెస్టు చేసిన పోలీసులు.. 35 బ్యాంకు ఖాతాలోని 54 కోట్ల వరకు సీజ్ చేసి ప్రధాన నిందితులపై నిఘా పెట్టారు. చాలా రోజుల తర్వాత పోలీసులు ప్రధాన నిందితుడైన ఉపేంద్రనాథ్ రెడ్డిని అరెస్టు చేసి విచారిస్తున్నారు.

## డాక్టర్ అకౌంట్ నుంచి డబ్బులు మాయం

**హైదరాబాద్, ఆగస్టు 16**

ఓఎల్ఎక్స్‌లో ఎలక్ట్రిక్ కుర్చీ కొంటానంటూ డాక్టర్ కి షాక్ ఇచ్చారు సైబర్ నేరగాడు. ఏకంగా లక్షల రూపాయలు కాజేసి హ్యాండ్ ఇచ్చాడు. నిమ్స్‌లో పనిచేస్తున్న ఒక వైద్యుడికి సైబర్ నేరగాళ్ల టోకరా కలకలం రేపింది. పంజాగుట్ట నిమ్స్ లో సీనియర్ రెసిడెంట్‌గా పని చేస్తున్న వైద్యుడు ఓఎల్ఎక్స్ ఎలక్ట్రిక్ కుర్చీ అమ్మకానికి పెట్టాడు. అంతే జితేంద్ర శర్మ పేరుతో వైద్యుడికి ఫోన్ వచ్చింది. తనను తాను జితేంద్ర శర్మ పేరుతో పరిచయం చేసుకున్న సైబర్ నేరగాడు తనకు కూకట్‌పల్లిలో ఫర్నిచర్ దుకాణం ఉందని నమ్మబలికాడు. అనంతరం కుర్చీ కొనుగోలు చేస్తా అని చెప్పి డబ్బు పంపేందుకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలని చెప్పాడు. నమ్మిన వైద్యుడు అలాగే చేశాడు. దీంతో వైద్యుడి ఖాతా నుంచి రూ.2.58 లక్షలు సైబర్ నేరగాడు కొట్టేశాడు. మోసపోయానని గ్రహించిన వైద్యుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు.కొంతకాలంగా ఓఎల్ఎక్స్ లో వస్తువులు కొంటామంటూ వస్తున్న వ్యక్తులని నమోదు అని పదేపదే పోలీసులు హెచ్చరిస్తున్న జనాలు మాత్రం పాటించడం లేదు. గతంలో అనేకసార్లు ఓఎల్ఎక్స్ లో అనేక ఐటమ్స్ విషయంలో చాలామంది మోసపోయారు. ఓఎల్ఎక్స్ విషయంలో ఎవరికీ స్కానర్స్ కానీ క్యూఆర్ కోడ్ కానీ ఓటీపీలు కానీ చెప్పొద్దంటూ పోలీసులు ఎంత మొత్తుకుంటున్నా కూడా పబ్లిక్ మాత్రం మారడం లేదు. రోజుకి పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో కనీసం ఇప్పటినుంచి అయినా ఎవరు కూడా ఓఎల్ఎక్స్ లో నమోదంటూ పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.తాజాగా పోలీసులు చెబుతుందని ప్రకారం సైబర్ నేరాల్లో అత్యధికంగా మోసానికి గురవుతున్న వారు చదువుకున్న వారే కావడం గమనార్హం. పోలీసులు మీడియా పదేపదే సైబర్ నేరగాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నప్పటికీ వైద్యుల లాంటి చదువు చదివిన ఉన్నత విద్యావంతుల సైతం సైబర్ నేరగాల చేతిలో మోసపోవడం కల కలం రేపుతుంది.

# ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'ఎలెవెన్'- ప్రారంభం




నవీన్ చంద్ర హీరోగా లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వంలో 'సిల నేరంగాలిల్ సిల మణిధర్‌గళ్', 'సెంబి' లాంటి విజయవంతమైన చిత్రాలని అందించిన ఎఆర్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రొడక్షన్ నెంబర్3గా అజ్మల్ ఖాన్, రేయా హరి ఓ రేసీ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'ఎలెవెన్' అంటే టైటిల్ ని ఖారారు చేశారు. ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైయింది.'కలకలప్పు 2', 'వంద రాజవతాన్ వరువెన్', 'యాక్షన్' చిత్రాలలో దర్శకుడు సుందర్ సి దగ్గర అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన లోకేశ్ అజ్ల్స్ 'ఎలెవెన్' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందుతోంది. నవీన్ చంద్ర 'శరభం', 'శివప్పు , 'బ్రమ్మన్' లాంటి తమిళ చిత్రాలలో కూడా నటించారు. ప్రస్తుతం దర్శకుడు శంకర్ 'గేమ్ ఛేంజర్', కార్తీక్ సుబ్బరాజ్'జిగర్తాండ డబుల్ ఎక్స్'లలో కీలక పాత్రలు పోహిస్తున్నారు నవీన్ చంద్ర.'సిల నెరంగళిల్ సిల మణిధర్గళ్' చిత్రంలో నటించిన రేయా హరి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో 'విరుమండి' ఫేమ్ అభిరామి, 'వత్తికూచి' ఫేమ్ దిలీపన్, 'మద్రాస్' ఫేమ్ రిత్విక కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. డి.ఇమ్మాన్ సంగీతం అందిస్తుండగా, బాలీవుడ్‌లో అనుభవం ఉన్న కార్తీక్ అశోక్ సినిమాటోగ్రఫర్ గా పని చేస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకాంత్ ఎన్.బి ఎడిటర్.

'ఎలెవెన్' దర్శకుడు లోకేశ్ అజ్ల్స్ మాట్లాడుతూ " మొదటి నుంచి చివరి వరకు ప్రేక్షకులకు సీట్ ఎడ్జ్ ఎక్స్ పీరియన్స్ ఇచ్చే ఫాస్ట్-పేస్డ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ఇది. ప్రతిభావంతులైన నటీనటుల, సాంకేతిక నిపుణులు ఈ చిత్రానికి పని చేస్తున్నారు. నిర్మాతలకు ధన్యవాదాలు. సినిమా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను." అన్నారు. ఈ చిత్రం షూటింగ్ ఆగస్ట్ 23 నుంచి ప్రారంభమవుతుంది.

తారాగణం: నవీన్ చంద్ర, రేయా హరి, అభిరామి, దిలీపన్, రిత్విక

# రామ్ చరణ్ విడుదల చేసిన 'బెదురులంక 2012' ట్రైలర్



డిసెంబర్ 21, 1012... ప్రపంచమంతా యుగాంతం వస్తుందని భయపడిన రోజు! ఆ రోజు యుగాంతం రాలేదు. అయితే, ఆంధ్రప్రదేశ్‌లోని లంక గ్రామాల్లో ఓ గ్రామమైన బెదురులంకలో కొందరు కేటుగాళ్ళు ప్రజల్లో భక్తిని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని యుగాంతం అంటూ భయపెట్టి దేవుడి పేరుతో దోపిడీకి తెర తీశారు. వాళ్ళ మాయమాటలు నమ్మని శివ శంకర వరప్రసాద్ ఏం చేశాడు? అనేది ఆగస్టు 25న వెండితెరపై చూడాలి. ఎందుకంటే... శివ శంకర వరప్రసాద్ పాత్రలో యువ హీరో కార్తికేయ గుమ్మకొండ ఆ రోజు నుంచి థియేటర్లలో సందడి చేయనున్నారు.

కార్తికేయ గుమ్మకొండ, 'డీజే టిల్లు' ఫేమ్ నేహా శెట్టి జంటగా నటించిన సినిమా 'బెదురులంక 2012'. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సి. యువరాజ్ సమర్పణలో రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పానేని నిర్మించారు. ఈ సినిమాతో క్లాక్స్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆగస్టు 25న థియేటర్లలో విడుదలకు సిద్ధమైందీ సినిమా.

మెగాస్టార్ చిరంజీవికి కార్తికేయ వీరాభిమాని అనే సంగతి తెలిసిందే. చిరంజీవి అసలు పేరు శివశంకర వరప్రసాద్. 'బెదురులంక 2012'లో కార్తికేయ క్యారెక్టర్ పేరు కూడా అదే. ఇప్పుడీ సినిమా ట్రైలర్ సైతం చిరు తనయుడు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ చేతుల మీదుగా విడుదల చేశారు. ట్రైలర్ విడుదల చేసిన అనంతరం సినిమా విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ కార్తికేయకు, చిత్ర బృందానికి రామ్ చరణ్ శుభాకాంక్షలు చెప్పారు.

రామ్ చరణ్ మాట్లాడుతూ "కార్తికేయ, నేహా శెట్టిల జంట చాలా బాగుంది. ఇద్దరు చూడముచ్చటగా ఉన్నారు. 'బెదురులంక 2012' ట్రైలర్, ఇందులో చెప్పిన కథ చాలా బాగుంది. అజయ్ ఘోష్ గారి పాత్ర వచ్చినప్పటి నుంచి ఇంకా బాగుంది. సంగీతం కూడా చాలా కొత్తగా వినిపించింది. 'ఆర్ఎక్స్ 100' సెన్సేషనల్ హిట్ అయ్యింది. కార్తికేయ కొత్త కాన్సెప్ట్ సెలెక్ట్ చేసుకుని సినిమాలు చేస్తారు. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను. యూనిట్ అందరికీ ఆల్ ద బెస్ట్" అని అన్నారు.

కామెడీ, రొమాన్స్, యాక్షన్, డ్రామా... 'బెదురులంక 2012'లో ప్రేక్షకులు కోరుకునే అంశాలు అన్నీ ఉన్నాయని ట్రైలర్ ద్వారా చెప్పకనే చిత్రబృందం చెప్పింది. శివశంకర వరప్రసాద్ పాత్రలో కార్తికేయ కనిపించగా... అతడిని పిచ్చిగా ప్రేమించే అమ్మాయిగా నేహా శెట్టి నటించారు. తాను సిగరెట్ కాల్చడం వల్ల పోతే తన లంగ్స్ పోతాయని, వస్తే తనకే క్యాన్సర్ వస్తుందని ఊరి పెద్దలకు శివ చెప్పడం చూస్తుంటే వాళ్ళను అతడు లెక్క చేయడని అర్థం అవుతోంది. యుగాంతం పేరుతో కొత్త నాటకానికి తెర తీసిన పెద్దలకు శివ ఎలా బుద్ధి చెప్పాడు? అనేది కథ అని అర్థం అవుతోంది.'సాక్షాత్తు శ్రీ మహావిష్ణువు అనేక అవతారాలు ఎత్తిన ప్పప్పటికీ... ముందు మూడు యుగాలను అంతం అవ్వలేకుండా ఆపలేక పోయినప్పుడు ఈ బ్రహ్మం డేనియల్ (ఆటో రామ్ ప్రసాద్) కలిసి కలి యుగాంతాన్ని ఆపేస్తానంటే మీరు ఎలా నమ్మేశారండి?' అని హీరో ఓ డైలాగ్ చెబుతారు. ప్రేక్షకుల్లో ఆ మాట ఆలోచన కలిగించేలా ఉంది.



# మ్యూజిక్ లవర్స్ ను మెస్మరైజ్ చేసిన 'ఖుషి' మ్యూజిక్ కన్సర్ట్




విజయ్ దేవరకొండ, సమంత హీరో హీరోయిన్లుగా నటిస్తున్న 'ఖుషి' సినిమా మ్యూజిక్ కన్సర్ట్ మంగళవారం సాయంత్రం హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం ఆద్యంతం మ్యూజిక్ లవర్స్ ను మెస్మరైజ్ చేసింది. ఈ మ్యూజిక్ కన్సర్ట్ లో 'ఖుషి' సినిమాలోని బ్యూటిపుల్ సాంగ్స్ ను సింగర్స్ జావెద్ అలీ, సిధ్ శ్రీరామ్, మంజూష, చిన్మయి, సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వాహబ్ పాడి ఆకట్టుకున్నారు. 'ఖుషి' టైటిల్ సాంగ్ లో విజయ్ దేవరకొండ, సమంత లైవ్ పర్ ఫార్మెన్స్ కు ఆడియెన్స్ స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మాణంలో దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన 'ఖుషి' పాన్ ఇండియా స్థాయిలో సెప్టెంబర్ 1న రిలీజ్ కు రెడీ అవుతోంది.

మ్యూజిక్ కన్సర్ట్ లో

ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ - 'ఖుషి' మ్యూజిక్ కన్సర్ట్ లో ఒక ఆడియెన్ గా ఎంజాయ్ చేయాలని ఫ్యామిలీతో కలిసి వచ్చాను. నన్ను మాట్లాడమని పిలుస్తారని అనుకోలేదు. ప్రేమంటే ఏంటో మా బేబీ సినిమాలోని డైలాగ్ ద్వారా చెబుతాను. ఎవరు లేకపోతే నీ జీవితం నీది కాదో అదే నిజమైన ప్రేమ. మా అన్నయ్య విజయ్, సమంత గారి కోసం బేబీ సినిమాలోని ఓ పాట పాడాలని ఉంది. నా ముందు విజయ్, సమంత రూపంలో ఇద్దరు బ్యుటిఫుల్ యాక్టర్స్ ను చూస్తున్నా. సెప్టెంబర్ 1న థియేటర్స్ లో మస్త్ ఖుషి చేసుకుందాం. అన్నారు.

సినిమాటోగ్రాఫర్ జి.మురళి మాట్లాడుతూ - తెలుగులో అందాల రాక్షసి సినిమా తర్వాత నేను చేస్తున్న మరో ప్రేమ కథా చిత్రమిది. నన్ను కెరీర్ లో ప్రోత్సహించిన నా కుటుంబానికి థాంక్స్ చెబుతున్నా. వారి వల్లే నేను ఈ వేదిక మీద ఉన్నా. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థకు కృతజ్ఞతలు చెబుతున్నా. రవి, నవీన్ లాంటి మంచి ప్రొడ్యూసర్స్ ను తొలిసారి చూస్తున్నా. రా రస్టిక్ మూవీస్ చేస్తున్న నాకు దర్శకుడు శివ గారు లవ్ స్టోరికి పనిచేసే అవకాశం ఇచ్చారు. 'ఖుషి' లో ఆరాధ్య, విప్లవ్ క్యారెక్టర్స్ లవబుల్ గా ఉంటాయి. సినిమా చూశాక వీళ్లిద్దరిని మీరు మర్చిపోలేరు. సెప్టెంబర్ 1న ఈ సినిమాను ప్రతి ఒక్కరు ఎంజాయ్ చేస్తారు. అని అన్నారు.

మైత్రీ సీఈవో చెర్రీ మాట్లాడుతూ - 'ఖుషి' మ్యూజిక్ కన్సర్ట్ ను ఇంత గ్రాండ్ గా ఆర్గనైజ్ చేయడం సంతోషంగా ఉంది. సంగీత దర్శకుడు హేషమ్ గారు ప్రతి సింగర్, మ్యూజీషియన్ ను తీసుకొచ్చి ఇంత బాగా ప్రోగ్రాం చేస్తున్నారు. ఆయనకు థాంక్స్ చెబుతున్నా. మా సంస్థలో విజయ్ డియర్ కామ్రేడ్ చేశాడు. సమంత రంగస్థలం చేసింది. పుష్ప లో ఆమె స్పెషల్ సాంగ్ ఎంత హిట్ అయ్యిందో మీకు తెలుసు. వీళ్లిద్దరు మరోసారి మా సంస్థలో పనిచేయడం ఆనందంగా ఉంది. అలాగే మాకు ఒక మెమొరబుల్ మూవీ చేసిన డైరెక్టర్ శివ గారికి థాంక్స్. 'ఖుషి' కోసం ఏదైనా బిగ్ ఈవెంట్ చేయాలనుకున్నప్పుడు మ్యూజిక్ కన్సర్ట్ బాగుంటుందని అనిపించింది. ఈవెంట్ ను ప్రతి ఒక్కరు ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నా. అన్నారు.

Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950